www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
# హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:88 SATURDAY , AUGUST 15, 2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 88 శనివారం 15 ఆగష్టు 2026 పేజీలు :8 వెల: 4/-

## ప్రజలకు అందుబాటులోకి సనత్‌నగర్ 'టిమ్స్'.. 17న ప్రారంభించనున్న రేవంత్‌రెడ్డి



- రూ.1,070 కోట్ల వ్యయంతో 1,082 పడకలతో నిర్మాణం
- మొదట 582 పడకలతో సేవలు
- అక్టోబర్‌కు పూర్తిస్థాయిలో అందుబాటు
- నిమ్స్ తరహాలో స్వయంప్రతిపత్తి హోదాతో కార్యకలాపాలు

## అంబేడ్కర్, జ్యోతిబా పూలే స్ఫూర్తితో విద్యార్థులు చదువుకోవాలి: సీఎం రేవంత్ రెడ్డి



హంసకలం వార్త ఆగస్టు 14 :

చదువుతోనే ఆత్మగౌరవం, గుర్తింపు లభిస్తాయని, విద్య ఒక్కటే తలరాతలను మార్చే మార్గమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం నెక్లెస్ రోడ్డులో మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఒకవైపు డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మరోవైపు ఇందిరాగాంధీ, పీవీ నరసింహారావు, జ్యోతిబా పూలే విగ్రహాలను ఆవిష్కరించుకోవడం గర్వకారణమని రేవంత్ పేర్కొన్నారు. నెక్లెస్ రోడ్ చౌరస్తా ఇప్పుడు అద్భుతంగా మారిందని చెప్పారు. మిగతా2లో

## పెరుగుతున్న సన్నబియ్యం ధరలు..



రెండునెలల్లో రూ.800 క్వింటాకు పెరుగుదల

లక్ష మంది వినియోగదారుల పై భారం

జైశ్రీరాం రైస్‌కు డిమాండ్

తాజాగా ధాన్యం రేట్ రూ.4,355

హంసకలం వార్త ఆగస్టు 14 :

సన్నబియ్యం ధరలు పెరుగుతున్నాయి. వినియోగదారులకు రైస్‌రేట్లు షాక్ ఇస్తున్నాయి.ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ సాధారణ సన్నరకాలతో పాటు అతి సన్నరకాలైన జైశ్రీరాం బియ్యం ధరలు అనూహ్యంగా పెరుగుతున్నాయి. మిగతా2లో

## సెప్టెంబరులో భారత్‌కు ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్!



- బ్రిక్స్ సదస్సుకు హాజరయ్యే అవకాశాలు
- ఇటీవలే భారత్‌కు వచ్చిన ఇరాన్ విదేశాంగ మంత్రి
- పశ్చిమాసియా భద్రతలో భారత్ మరింత కీలక పాత్ర పోషించగలదని వ్యాఖ్య
- ఈ నేపథ్యంలో పెజెష్కియాన్ భారత పర్యటనకు ప్రాధాన్యం

# స్కూల్ ఫీజుల నియంత్రణకు చట్టం తేవాలి



- ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల పై ఆకునూరి మురళి ఆందోళన
- భారీ ఫీజులతో సామాన్య కుటుంబాల పై ఆర్థిక భారం
- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలని సూచన
- ఫీజుల నియంత్రణ కోసం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడి
- తల్లిదండ్రులు, విద్యావేత్తలు హాజరుకావాలని పిలుపు

## నాకు, విద్యార్థులకు మధ్య జోక్యం చేసుకోవద్దు



హంసకలం వార్త ఆగస్టు 14 :

నల్సార్ విశ్వవిద్యాలయ విద్యార్థుల పై చర్యలకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సిద్ధమైనందుకు చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా సూర్యకాంత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తనకూ, విద్యార్థులకు మధ్య జోక్యం చేసుకునేందుకు వారెవరని ప్రశ్నించారు. 2026 బ్యాచ్ విద్యార్థులను న్యాయవాదులుగా చేర్చుకోవద్దంటూ రాష్ట్ర కౌన్సిల్స్‌ను బీసీఐ ఆదేశించిన విషయం తెలిసిందే. మిగతా2లో

## గంజాయి ముఠాతో పోలీసుల చెట్టపట్టాల్..



- బాలానగర్‌లో గంజాయి విక్రయిస్తున్న ముఠా పై ఈగల్ పోలీసుల దాడి
- పోలీసుల పై కుక్కలను ఉసిగొల్పి స్క్రూడ్రైవర్‌తో దాడి చేసిన నిందితులు
- నలుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు, 14.5 కిలోల గంజాయి స్వాధీనం
- గంజాయి ముఠాతో స్థానిక పోలీసులకు సంబంధాలు ఉన్నట్లు వెల్లడి

## భారత్ పక్కన కొత్త ఉగ్రముఠాలు.. బంగ్లాదేశ్‌లో అల్‌ఖైదా స్థావరాల పై ఐరాస హెచ్చరిక!



- ఉగ్ర సెల్స్‌ను ఏర్పాటు చేసేందుకు ఏక్యూఐఎస్ యత్నాలు
- దక్షిణాసియాలో ఉగ్ర ముప్పు మరింత తీవ్రంగా మారిందని వెల్లడి
- బంగ్లాదేశ్‌లో ఉగ్ర నెట్‌వర్క్‌ల పై ఐరాస ఆందోళన
- పాక్-ఆఫ్ఘన్ ఉద్రిక్తతలు ఉగ్ర ముప్పును పెంచుతున్నాయని వెల్లడి

## స్మార్ట్ రేషన్ కార్డుల పై ప్రధాని మోదీ ఫొటో ఎందుకు పెట్టరు: ఎంపీ రఘునందన్ రావు..

హంసకలం వార్త ఆగస్టు 14 :

తెలంగాణ ప్రభుత్వం జారీ చేసే స్మార్ట్ రేషన్ కార్డుల పై ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో లేకపోవడం పై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఫొటో కచ్చితంగా పెట్టాల్సిందేనని డిమాండ్ చేశారు. కేంద్రం తన వాటా కింద ఇచ్చే బియ్యానికి రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం లేదని రఘునందన్ రావు ఆక్షేపించారు.



# అంబేడ్కర్, జ్యోతిబా పూలే స్ఫూర్తితో విద్యార్థులు చదువుకోవాలి: సీఎం రేవంత్ రెడ్డి

నెక్లెస్ రోడ్ చౌరస్తా ఇప్పుడు అద్భుతంగా మారిందని చెప్పారు. 150 ఏళ్ల క్రితమే జ్యోతిబా పూలే చదువే ఏకైక మార్గమని చాటిచెప్పారని, తాను చదువుకోవడంతో పాటు తన సతీమణి సావిత్రిబాయి పూలేను చదివించి ఆదర్శంగా నిలిచారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇంతకాలం తర్వాత కూడా పూలేను ఆదర్శ పురుషుడిగా గుర్తిస్తున్నామంటే ఆయన ఆలోచనల గొప్పతనం అర్థమవుతోందని సీఎం అన్నారు. తమ ప్రభుత్వం జ్యోతిబా పూలే ఆలోచనలను కొనసాగిస్తోందని తెలిపారు. కుల నిర్మూలన, సామాజిక చైతన్యం సాధించాలంటే అందరూ కలిసి చదువుకోవడం, జీవించడం అవసరమన్నారు. అందుకే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను తీసుకొస్తున్నామని చెప్పారు. విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తున్నామని, నర్సరీ నుంచి విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. వారి స్ఫూర్తితో విద్యలో రాణించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పారదర్శకంగా అమలు చేస్తామని, ముందుగానే నిధులు అందించే విధానాన్ని తీసుకొస్తున్నామని చెప్పారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఏ కళాశాలా అడ్డుకోలేని విధంగా చర్యలు చేపడుతున్నామని రేవంత్ ధీమా వ్యక్తం చేశారు. సర్టిఫికెట్ ఒక్కటే ఉద్యోగానికి సరిపోదని ఆయన స్పష్టం చేశారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యతో పాటు నైపుణ్యాలను నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. స్కిల్స్ ఉంటేనే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో నర్సింగ్ రంగంలో మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయని, విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. 2024లో టాటా సంస్థతో కలిసి 119 నియోజకవర్గాల్లో ఏటీసీలను ఏర్పాటు చేశామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆయా కేంద్రాల్లో చేరిన విద్యార్థులకు నెలకు రూ. 2 వేల స్టైఫండ్ ఇస్తున్నామని చెప్పారు. విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యాలను అందిస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించాలంటే కేవలం మార్కులు, డిగ్రీలు సరిపోవని, నైపుణ్యాలూ అవసరమని అన్నారు. గ్రూప్-1 నియామకాల్లో బీసీలకు పెద్ద సంఖ్యలో అవకాశాలు లభించాయని తెలిపారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని వెల్లడించారు. క్రీడల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తున్నామని చెప్పారు. సిరాజ్, నిక్కజ్, దీప్తి వంటి క్రీడాకారులకు ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు గురించి ఎంత బాధ్యతగా ఆలోచిస్తారో, తానూ అంతే బాధ్యతగా ఆలోచిస్తానని రేవంత్‌రెడ్డి అన్నారు. క్రీడల్లో రాణించి పతకాలు తీసుకొస్తే నగదు నజరానాలతో పాటు ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత తనదేనని చెప్పారు. సామాజిక చైతన్యంతో తమ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటోందని సీఎం తెలిపారు. మాదిగలు దశాబ్దాలుగా పోరాడుతున్న ఎస్సీ వర్గీకరణ సమస్యను పరిష్కరించామని చెప్పారు. దేశంలో బీసీ జనగణన చేపట్టడానికి ఎవరూ ధైర్యం చేయలేదని, బ్రిటిష్ పాలన తర్వాత తొలిసారిగా బీసీల లెక్క తేల్చామని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఏడాదిలోనే కులగణన పూర్తి చేశామని తెలిపారు. కులగణనలో కొందరు మాజీ ముఖ్యమంత్రులు, మాజీ మంత్రులు పాల్గొనకుండా వ్యతిరేకించారని ఆరోపించారు. బలహీన వర్గాలకు ఉద్యోగాలు, అవకాశాలు కల్పించాలంటే వారి జనాభా లెక్కలు తెలియాలని, అందుకే కులగణన చేపట్టామని సీఎం వివరించారు. ప్రతి సమస్యను పరిష్కరించుకుంటూ ముందుకు వెళున్నామని చెప్పారు. గత ప్రభుత్వం ప్రజలను గొర్రెలు, బర్రెలు పెంచుకోవాలని, చెప్పులు కుట్టుకోవాలని, చేపలు పట్టుకోవాలని చెప్పిందని రేవంత్‌రెడ్డి విమర్శించారు. బీసీలు చదువుకుని ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, మంత్రులు, ఎమ్మెల్యేలు కావద్దా? అని ప్రశ్నించారు. 'చదువు ఒక్కటే తలరాతలను మారుస్తుంది. చదువు ఒక్కటే పరిష్కారం. అదే మార్గం' అని సీఎం అన్నారు. తెలంగాణను ప్రపంచ పటంలో నిలపడానికి విద్యే మార్గమని పేర్కొన్నారు. జ్యోతిబా పూలే స్ఫూర్తితో విద్యార్థులు భవిష్యత్తులో చట్టసభల్లోకి రావాలని, డాక్టర్లు, ఇంజినీర్లు కావాలని ఆకాంక్షించారు. నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించే బాధ్యత తనదేనన్నారు. 'మీ బంగారు భవిష్యత్తు కోసం రోజుకు 18 గంటలు పనిచేస్తా. ఇంత మంచి అవకాశం మళ్లీ రాదు. ఈ ప్రభుత్వాన్ని కొనసాగించాలి' అని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# సెప్టెంబరులో భారత్‌కు ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్!

ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సెప్టెంబరులో భారత్‌కు రానున్నట్లు సమాచారం. ఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ సదస్సులో ఆయన పాల్గొననున్నట్లు ఏఎన్ఐ వార్తాసంస్థ వెల్లడించింది. 2026లో బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన భారత్.. 18వ శిఖరాగ్ర సమావేశానికి ఆతిథ్యం ఇవ్వనుంది. భారత్ అధ్యక్షతన జరిగే ఈ సదస్సు 'బిల్డింగ్ ఫర్ రెసిలియన్స్, ఇన్నోవేషన్, కోఆపరేషన్ అండ్ సస్టెయినబిలిటీ' అనే అజెండాతో సాగనుంది. 2026 ఆరంభంలో బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను బ్రెజిల్ నుంచి భారత్ స్వీకరించింది. పెజెష్కియాన్ పర్యటనకు మరో ప్రాధాన్యం ఉంది. 2024 అక్టోబరులో రష్యాలోని కజాన్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సు సందర్భంగా ఆయన ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలతో పాటు ప్రాంతీయ పరిణామాల పై ఇరువురు నేతలు చర్చించారు. ఇరాన్ 2024లో బ్రిక్స్‌లో పూర్తిస్థాయి సభ్యత్వం పొందింది. అదే సమయంలో ఈజిప్ట్, ఇథియోపియా, యూఏఈ కూడా కూటమిలో చేరాయి. 2025లో ఇండోనేషియా సభ్యత్వం పొందడంతో బ్రిక్స్ పూర్తిస్థాయి సభ్యుల సంఖ్య 11కి చేరింది. ఇటీవలే ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ భారత్‌కు వచ్చారు. బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొన్న ఆయన.. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించడంలో భారత్ మరింత కీలక పాత్ర పోషించగలదని చెప్పారు. అవసరమైతే భారత్ చేపట్టే నిర్మాణాత్మక ప్రయత్నాలను స్వాగతిస్తామని స్పష్టం చేశారు. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య భద్రతకు ఇరాన్ కట్టుబడి ఉంటుందని అరాఘ్చీ తెలిపారు. సైనిక పరిష్కారం కంటే చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవడమే మార్గమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పెజెష్కియాన్ భారత్ పర్యటనకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది.

# గంజాయి ముఠాతో పోలీసుల చెట్టపట్టాల్

ఈ ఘటనలో తెలంగాణ ఈగల్ పోలీసులు సినీ ఫక్కీలో నలుగురు నిందితులను అరెస్టు చేశారు. ఈ ముఠాతో స్థానిక పోలీసులకు దగ్గరి సంబంధాలు ఉన్నట్టు తేలడం సంచలనం రేపుతోంది. ఏపీలోని పాడేరుకు చెందిన ముగ్గురు అన్నదమ్ములు బాలానగర్‌ను కేంద్రంగా చేసుకుని గంజాయి దందా నడుపుతున్నారు. క్యాటరింగ్ ముసుగులో ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల నుంచి గంజాయి తెచ్చి వాట్సప్ ద్వారా విక్రయిస్తున్నారు. పక్కా సమాచారంతో ఈగల్ పోలీసులు బుధవారం అర్ధరాత్రి నిందితుల ఇంటిపై దాడి చేశారు. పోలీసులను గమనించిన నిందితులు వారిపైకి కుక్కలను వదిలారు. ఈ దాడిలో ఓ కానిస్టేబుల్ గాయపడ్డారు. ఇంతలో కిరణ్ అనే నిందితుడు ఓ ఇన్‌స్పెక్టర్‌ను స్క్రూడ్రైవర్‌తో పొడిచి భవనాలపైకి దూకుతూ పారిపోయే ప్రయత్నం చేశాడు. మూడంతస్తుల అపార్ట్‌మెంట్‌పైకి ఎక్కి, సెల్ఫీ వీడియో తీసుకుంటూ ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. కిందకు దూకడంతో గాయపడిన అతడిని పోలీసులు పట్టుకుని ఆసుపత్రికి తరలించారు. అతడి భార్య హారికను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 14.5 కిలోల గంజాయి, ఒక ఎయిర్ గన్ స్వాధీనం చేసుకున్నారు. విచారణలో గంజాయి ముఠాతో బాలానగర్ ఠాణాకు చెందిన ఓ ఎస్సై, ఐదుగురు కానిస్టేబుళ్లకు సంబంధాలున్నట్లు తేలింది. ఈగల్ పోలీసుల దాడికి కొన్ని నిమిషాల ముందే ఓ కానిస్టేబుల్ నిందితుల ఇంటికి వచ్చి వెళ్లినట్లు గుర్తించారు. నిందితుల ఇంట్లో పోలీసులకు చెందిన వైర్‌లెస్ సెట్ పరికరం (మ్యాన్‌ప్యాక్) కూడా లభించడం కలకలం రేపుతోంది. ఈ ముఠాకు 200 మందికి పైగా కస్టమర్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వారిలో 100 మందిని గుర్తించి అదుపులోకి తీసుకుని పరీక్షించగా వారిలో 72 మందికి పాజిటివ్ వచ్చిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటన పై ఉన్నతాధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పై ప్రధాని మోదీ ఫొటో ఎందుకు పెట్టరు: ఎంపీ రఘునందన్ రావు..

కేంద్రం తన వాటా కింద ఇచ్చే బియ్యానికి రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం లేదని రఘునందన్ రావు ఆక్షేపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే ఆరు కిలోల బియ్యంలో ఐదు కిలోలు కేంద్రం ఇస్తున్నవేనని ఎంపీ పేర్కొన్నారు. ఒక్క కిలో బియ్యం ఇస్తూ కార్డు పై ముగ్గురు కాంగ్రెస్ నేతల ఫొటోలు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలతో స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వడాన్ని రఘునందన్ రావు ఆక్షేపించారు. మోదీ ఫొటో లేకపోవడం పై మండిపడ్డారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 1.06 కోట్ల రేషన్ కార్డుల పంపిణీ పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే సుమారు 90లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని, కొత్తగా ఎన్ని ఇస్తున్నారో ప్రభుత్వం వెల్లడించాలన్నారు. రేషన్ కార్డుల ముద్రణ ఖర్చులు, టెండర్ల వివరాలు బయటపెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎంపీ డిమాండ్ చేశారు. కార్డుల ముద్రణ కాంట్రాక్ట్ ఎవరికి ఇచ్చారు, ఎన్ని కోట్లు ఖర్చు చేస్తున్నారనే వివరాలను వెల్లడించాలన్నారు. అదేవిధంగా, రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని, వారికి గౌరవ వేతనం చెల్లించాలని పేర్కొన్నారు. పెంచిన రేషన్ డీలర్ల కమిషన్‌ను వెంటనే ఇవ్వాలని, బియ్యంలో నూకలు ఎక్కువగా ఉన్నాయన్న ఫిర్యాదులను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రేషన్ కార్డుల ద్వారా తెలంగాణలోని పేదలకు మరిన్ని నిత్యావసర సరకులు అందించాలని సూచించారు. కర్ణాటక తరహాలో కందిపప్పు, నూనె, రాగులు, చక్కెర, గోధుమలు ఇవ్వాలని.. బియ్యం వద్దనుకునే వారికి ప్రత్యామ్నాయ ఆహార ధాన్యాలు అందించాలన్నారు. పేదల ఆహార భద్రతపై కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి చూపాలని అన్నారు. అలాగే, రేషన్ కార్డుల పంపిణీని పునఃపరిశీలించాలని, మోదీ ఫొటోతో కొత్త కార్డులు ముద్రించాలని ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు.

## భారత్ పక్కన కొత్త ఉగ్రముఠాలు.. బంగ్లాదేశ్‌లో అల్‌ఖైదా స్థావరాల పై ఐరాస హెచ్చరిక!

బంగ్లాదేశ్‌ను అడ్డాగా మార్చుకుని ఉగ్రవాద కార్యకలాపాలను విస్తరించేందుకు అల్‌ఖైదా ప్రయత్నిస్తోందని ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది. 'అల్‌ఖైదా ఇన్ ది ఇండియన్ సబ్‌కాంటినెంట్' (ఏక్యూఐఎస్) అక్కడ ఉగ్రవాద సెల్స్‌ను ఏర్పాటు చేసేందుకు చురుగ్గా కదులుతున్నట్లు వెల్లడించింది. దక్షిణాసియాలో ఉగ్ర ముప్పు మరింత తీవ్రంగా మారుతోందని పేర్కొంది. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలికి సమర్పించిన 38వ నివేదికలో ఈ విషయాలను వెల్లడించింది. ఐసిస్, అల్‌ఖైదా తదితర ఉగ్ర సంస్థల పై పనిచేసే విశ్లేషణ, ఆంక్షల పర్యవేక్షణ బృందం ఈ నివేదికను రూపొందించింది. నివేదిక ప్రకారం.. ఏక్యూఐఎస్ గతంలో మాదిరిగా పెద్ద ఉగ్ర బృందాలపై ఆధారపడటం లేదు. చిన్నచిన్న, చెదురుమదురు సెల్స్‌తో పనిచేస్తోంది. లాజిస్టిక్స్, ఆర్థిక నెట్‌వర్క్‌లను ఏర్పాటు చేసుకుంటోంది. ఈ విధానంతో ప్రాంతీయంగా తన కార్యకలాపాలను విస్తరించేందుకు ప్రయత్నిస్తోంది. 2025 నవంబరులో ఢిల్లీలో జరిగిన ఎర్రకోట దాడికి ఏక్యూఐఎస్‌తో సంబంధం ఉన్నట్లు నివేదిక పేర్కొన్న విషయం తెలిసిందే. బంగ్లాదేశ్‌ను ఉగ్ర నెట్‌వర్క్ నిర్మాణానికి స్థావరంగా మార్చుకునే ప్రయత్నాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. బంగ్లాదేశ్‌లో రాజకీయ పరిణామాల తర్వాత ఉగ్ర సంస్థలకు అనుకూల వాతావరణం ఏర్పడే అవకాశాల పై ఇప్పటికే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఐరాస తాజా హెచ్చరిక ప్రాధాన్యం సంతరించుకుంది. దక్షిణా సియాలో ఉగ్ర ముప్పు పెరగడానికి పాకిస్థాన్-ఆఫ్ఘనిస్థాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు కూడా కారణమవుతున్నాయని నివేదిక తెలిపింది. తాలిబన్ పాలనలో ఆఫ్ఘనిస్థాన్‌లో పలు ఉగ్ర సంస్థలు కార్యకలాపాలు సాగించడం పొరుగు దేశాలకు దీర్ఘకాలిక ముప్పుగా మారిందని హెచ్చరించింది.

## ప్రజలకు అందుబాటులోకి సనత్‌నగర్ 'టిమ్స్'.. 17న ప్రారంభించనున్న రేవంత్‌రెడ్డి

నగర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో నిర్మించిన సనత్‌నగర్‌లోని మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎంసీఆర్ టిమ్స్) ఆసుపత్రి ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ నెల 17వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని అధికారికంగా ప్రారంభించనున్నారు. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రభుత్వ ఛాతీ ఆసుపత్రి ప్రాంగణంలో 22.6 ఎకరాల విస్తీర్ణంలో రూ. 1,070 కోట్ల భారీ బడ్జెట్‌తో దీన్ని నిర్మించారు. మొత్తం 1082 పడకల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ ఆసుపత్రిలో తొలిదశలో 582 పడకలతో సేవలను ప్రారంభించనున్నారు. మిగిలిన 500 పడకలు ఈ ఏడాది అక్టోబర్ నాటికి అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. ఇప్పటికే మే నెల నుంచి ఓపీ విభాగంలో ట్రయల్ రన్ నిర్వహిస్తుండగా, రోజూ 200 నుంచి 250 మంది వరకు రోగులు చికిత్స పొందుతున్నారు. ఈ ఆసుపత్రి ప్రధానంగా నాలుగు కీలక విభాగాలకు కేంద్రంగా నిలవనుంది. కార్డియాక్ (గుండె సంబంధిత), నెఫ్రాలజీ-యూరాలజీ (మూత్రపిండాల సంబంధిత), అవయవ మార్పిడి, ట్రామా విభాగాల్లో ప్రత్యేక వైద్య సేవలు అందించనున్నారు. వీటికి అనుబంధంగా మరో 37 విభాగాలు పనిచేస్తాయి. ఈ ఆస్పత్రికి నిమ్స్ తరహాలోనే స్వయంప్రతిపత్తి హోదా కల్పించారు. దీంతో నిధులను సొంతంగా సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అయితే, తొలి ఐదారేళ్ల పాటు ప్రభుత్వం గ్రాంట్ల రూపంలో ఆర్థిక సహాయం అందిస్తుంది. వాస్తవానికి, గత ఏడాది డిసెంబర్‌లో, ఆ తర్వాత ఉగాదికి ఈ ఆసుపత్రిని ప్రారంభించాలని భావించినా, పనులు పూర్తికాకపోవడంతో వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు అన్ని పనులు పూర్తికావడంతో ప్రభుత్వం దీనిని ప్రారంభించేందుకు సిద్ధమైంది.

## పెరుగుతున్న సన్నబియ్యం ధరలు..

రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌షాపుల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్నప్పటికీ, అవి కొత్తబియ్యం కావడంతో అన్నం సరిగ్గా కావడంలేదని, కొంతమంది ఈ బియ్యాన్ని నిల్వ పెట్టుకొని అవి పాతపడేంతవరకు ప్రైవేటు షాపుల్లో బియ్యం కొనుగోలు చేస్తున్నారు. అలాంటి వారితో పాటు మహబూబాబాద్ జిల్లాలో రేషన్‌కార్డులు లేని సుమారు లక్ష మంది వరకు ఈ బియ్యాన్ని బయట కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే పట్టణ ప్రాంతాల్లో అధికంగా, గ్రామీణ ప్రాంతాల్లో కొద్దిమంది అతిసన్న రకాలైన జైశ్రీరాం బియ్యం వినియోగిస్తున్నారు. వీరు కూడా రేషన్‌షాపుల్లో కాకుండా ప్రైవేటు షాపుల్లో బియ్యం కొనుగోలు చేస్తున్నారు. గత రెండు నెలల క్రితం సాధారణ సన్నరకాలైన ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ బియ్యం క్వింటాకు హోల్‌సేల్‌లో రూ. 4,700 నుంచి రూ. 4,800 వరకు ఉం డగా, తాజాగా ఈ రకం బియ్యం క్వింటాకు రూ. 5,200 నుంచి రూ. 5,500 వరకు పెరిగింది. అలాగే అతిసన్న రకాలైన జైశ్రీరాం బియ్యం గత రెండు నెలల క్రితం క్వింటాకు రూ. 5,600 నుంచి రూ. 5,800 ఉండగా, తాజాగా రూ. 6100 నుంచి రూ. 6200 లకు పెరిగింది. ఈ ధరలు కేవలం హోల్‌సేల్ మార్కెట్‌లోనివి రిటైల్ మార్కెట్లలో ఈ రేటుకు అదనంగా రూ. 300 నుంచి రూ. 500 కలుపుకొని ఉంటాయి.

## నాకు, విద్యార్థులకు మధ్య జోక్యం చేసుకోవద్దు

2026 బ్యాచ్ విద్యార్థులను న్యాయవాదులుగా చేర్చుకోవద్దంటూ రాష్ట్ర కౌన్సిల్స్‌ను బీసీఐ ఆదేశించిన విషయం తెలిసిందే. యూనివర్సిటీ స్నాతకోత్సవానికి సీజేఐని ముఖ్యఅతిథిగా ఆహ్వానించడంపై విద్యార్థులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఘటనపై విచారణ జరపాలని కూడా యూనివర్సిటీని కోరింది. ఈ నిర్ణయం పై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. చివరకు ఈ అంశం సుప్రీం కోర్టుకు చేరింది. ఈ పరిణామాల పై చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ సారథ్యంలోని ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు చేసింది. బీసీఐ జోక్యం ఎంతమాత్రం అవసరం లేదని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోకూడదని స్పష్టం చేశారు. ఇది విద్యార్థులకు, తనకు మధ్య ఉన్న అంశమని స్పష్టం చేశారు. బీసీఐకి ఈ అంశంలో ఎలాంటి నిమిత్తం లేదని అన్నారు. విద్యార్థులకు నిరసన తెలిపే హక్కు ఉందని కూడా స్పష్టం చేశారు. బీసీఐ అనవసరంగా జోక్యం చేసుకుందని కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే, ఆ ఆదేశాలను ఉపసంహరించుకున్నామని బీసీఐ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తదుపరి విచారణను కోర్టు మరో రెండు వారాల పాటు వాయిదా వేసింది. స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా చీఫ్ జస్టిస్‌ను ఆహ్వానించడం పై అభ్యంతరం చెబుతూ యూనివర్సిటీ అధికారులకు సుమారు 450 మంది లేఖ రాయడంతో వివాదం మొదలైంది. పేపర్ లీక్ పై ఛలో సంసద్ కార్యక్రమంలో విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యాన్ని సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌లో సుప్రీంకోర్టు తీరును తప్పుబట్టిన విద్యార్థులు ఈ లేఖను రాశారు.

## స్కూల్ ఫీజుల నియంత్రణకు చట్టం తేవాలి

ప్రైవేట్ పాఠశాలల ఫీజుల పెంపు పై విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుతున్నాయని ఆరోపించారు. సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై ఈ భారం పడుతోందని పేర్కొన్నారు. ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా వేదికగా విడుదల చేసిన వీడియోలో ఆయన ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తారు. నాణ్యమైన విద్య అందక పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపలేని పరిస్థితి ఉందన్నారు. మరోవైపు ప్రైవేట్ స్కూళ్లలో భారీ ఫీజులతో కుటుంబాల నెలవారీ బడ్జెట్ తలకిందుల వుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు గడిచినా ప్రజలకు నాణ్యమైన ప్రభుత్వ విద్య అందించలేకపోవడం బాధాకరమన్నారు. ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణకు సరైన చట్టం లేకపోవడం వల్లే సమస్య మరింత తీవ్రమవుతోందని విమర్శించారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణ చట్టం కోసం తెలంగాణ పీపుల్స్ ఫ్రంట్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆకునూరి మురళి తెలిపారు.

# సంపాదకీయం

## అమెరికా రాజకీయాల్లో 'సోషలిస్ట్' హవా!



ఒకటిన్నర దశాబ్దం తర్వాత అమెరికా భారీ రాజకీయ కుదుపునకు లోను కాబోతున్నదా? చాపకింద నీరులాగా డెమోక్రాట్లలో తమ ప్రాబల్యం పెంచుకుంటున్న డెమోక్రటిక్ సోషలిస్టులు అమెరికా రాజకీయ విధాన స్వరూపాలను పునర్నిర్వచించే బలమైన రాజకీయ శక్తిగా ఆవిర్భవించనున్నారా? డెమోక్రాట్ల ప్రైమరీస్ ఎన్నికలలో నమోదవుతున్న కొన్ని విజయాలు ఈ ప్రశ్నలు రేపుతున్నాయి. ఈ ఎన్నికల్లో డెమోక్రటిక్ సోషలిస్టులు గెలుస్తున్నారు. వారి గళం కొత్త నినాదాలను లేవనెత్తుతున్నది. ఆ స్వరాల సంఖ్య ప్రస్తుతానికి పరిమితమే కానీ, తమ వాదనల ద్వారా వారు సంప్రదాయ డెమోక్రాట్లలో కూడా మద్దతును కూడగట్టుకుంటున్నారు.మిషిగన్‌లో ప్రైమరీస్ ఎన్నికలలో అబ్దుల్ ఎల్ సయీద్ విజయం ఇందుకు తాజా ఉదాహరణ. డెమోక్రాట్ సోషలిస్ట్ అయిన సయీద్ అయిదుసార్లు కాంగ్రెస్ ఉమన్‌గా ఉన్న హేలీ స్టీవెన్స్‌ను స్వల్ప మెజారిటీతో ఓడించారు. డిస్ట్రిక్ట్ ప్రైమరీస్‌లో థాణేదార్‌ను డెమోక్రాట్ సోషలిస్టు డొనావన్ మెకిన్నీ ఓడించారు. అలాగే తాజా విజయాలు నమోదు చేసిన రషిదా త్లయిబ్, క్రిస్ గ్లిమర్ హిల్‌లు కూడా డెమోక్రటిక్ సోషలిస్టులే. ఈ విజయాలన్నీ డెమోక్రాట్లలో సోషలిస్టుల ఆధిపత్యం పెరుగుతోందన్న వాదనకు కొనసాగింపు మాత్రమే. న్యూయార్క్ సిటీ మేయర్ జొహ్రాన్ మందానీ వీరిలో ప్రముఖుడు. డెమోక్రాట్ సోషలిస్టుల భావజాలంతో కూడిన ప్రకటనలతో తరచూ వార్తల్లో నిలుస్తున్న వ్యక్తి కూడా.

అమెరికాను మరింత సోషలిజం వైపు తీసుకెళ్లాలనే వాదన డెమోక్రాట్లలో పెరుగుతోంది. ప్రైవేట్ హెల్త్ కేర్ రంగాన్ని సమూలంగా తొలగించడం, పోలీసులకు నిధులను తగ్గించడం వంటివి వీరు ప్రధానంగా తెరమీదకు తెస్తున్నారు. సొంత ఇంటి కల కోసం తాకట్టులు పెట్టాల్సిన పరిస్థితి ఉండదనే ప్రజాకర్షక ప్రకటనలతో వీరు ముందుకు వస్తున్నారు. అంతేకాదు, సెనేట్, ప్రెసిడెన్సీ, సుప్రీంకోర్టు వ్యవస్థలలో కూడా భారీ మార్పులు రావాలని వీరు డిమాండ్ చేస్తున్నారు.సాధారణంగా అమెరికాలో రాజకీయ నాయకుల మాటలు, ప్రకటనలు, వాగ్దానాలు రెండు రకాలు.

ప్రజల్లోంచి ఎన్నికవడానికి పార్టీ అభ్యర్థిగా వచ్చినప్పుడు ఒకరకమైన వాగ్దానాలు ఉంటాయి. పార్టీ అభ్యర్థిగా ఎంపికవడానికి ప్రైమరీస్ ఎన్నికల్లో పోటీచేసినప్పుడు ఆ మాటలు మరో రకంగా ఉంటాయి. సాధారణ ఎన్నికలంటే అన్ని వర్గాల, భిన్న ఆలోచనా ధోరణులకు చెందిన ప్రజల ఓట్లను రాబట్టేలా మాటలు ఉండాలి. కానీ ప్రైమరీస్ అలా కాదు. ప్రైమరీస్ ఎన్నికల్లో తమ పార్టీ కార్యకర్తలను ఆకట్టుకోవడమే ప్రధానం. పార్టీలో ఇంచుమించుగా తమ భావజాలానికి చెందినవారే కార్యకర్తలుగా ఉంటారు. కాబట్టి సారూప్యత ఉన్న తమ భావజాలంలోనే, కొన్ని అతివాద ధోరణులను ప్రదర్శించడం ద్వారా వారిని ఆకట్టుకోవాలి. డెమోక్రాట్ సోషలిస్టులు చేస్తున్నది అదే. 'మరింత సోషలిజం-- మరింత సమానత్వం' దిశగా తమ ఎజెండాను ప్రొజెక్ట్ చేస్తూ డెమోక్రాట్ పార్టీ ప్రైమరీస్‌లో వీరు నెగ్గుతున్నారు.

పెట్టుబడిదారీ వ్యవస్థలో సమూల మార్పులు తేవడం, పని అవసరం తక్కువ చేయడం, జరిమానాలు, అప్పులు, తాకట్టులు లేని సమాజం, అందరికీ సమానమైన-- ప్రభుత్వపరమైన ఆరోగ్యభద్రత లాంటివి వీరి ఎజెండా అంశాలు. డెమోక్రాటిక్ సోషలిస్టులు వ్యాప్తిచేస్తున్న భావజాలంలో, యుద్ధాలు లేని సమాజం, జాతి లింగ వివక్షలను రూపుమాపడం వంటివీ ఉన్నాయి. ఇరాన్, క్యూబా, వెనెజువెలా వంటి దేశాలతో ఆంక్షలు లేని, నియంత్రణలు లేని సంబంధ బాంధవ్యాలు కావాలనే డిమాండ్ కూడా ఉంది.

ఈ పరిణామాలను విశ్లేషకులు బరాక్ ఒబామా అధ్యక్షుడిగా ఉన్న రోజుల్లో రిపబ్లికన్ పార్టీలో మొదలైన టీపార్టీ ఉద్యమంతో పోలుస్తున్నారు. అప్పట్లో ఒబామా పాలన నాటి హెల్త్ కేర్ సంస్కరణలు, ప్రభుత్వ వ్యయాలు, పన్నుల విధానాలను కొందరు కన్జర్వేటివ్ నాయకులు వ్యతిరేకించారు.

వారు నిరసనలతో ఆగలేదు. తమ బలమైన వ్యతిరేకతతో ఏకీభవించే వారినే రిపబ్లికన్ ప్రైమరీస్‌లో పోటీచేయించారు. ఆ పార్టీలో అప్పటికే గుర్తింపు పొందిన అభ్యర్థి కంటే, మరింత కన్జర్వేటివ్ ఆలోచనలున్న అభ్యర్థులకే ఈ టీపార్టీ ఉద్యమకారుల అండ లభించింది. 'డెమోక్రాట్లను ఓడించడం మాత్రమే కాదు, రిపబ్లికన్ పార్టీ గమనాన్ని కూడా మరింత కన్జర్వేటివ్‌గా పునర్నిర్దేశిస్తాం' అన్నట్టుగా వారి ధోరణి సాగింది.

వీరు 63 సీట్లు గెలిచి రిపబ్లికన్ హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ నియంత్రణ మొత్తాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నారు. సెనేట్‌లో 6 సీట్లు గెలిచినా మెజారిటీ దక్కలేదు. అప్పటివరకు ఉదారవాద-- కన్జర్వేటివ్ భావజాలాల మిశ్రమంగా ఉన్న రిపబ్లికన్ పార్టీ ఎక్కువ కన్జర్వేటివ్‌గా మారింది.

# ఎఫ్‌ఆర్సీఏ బిల్లు: సేవకు రక్షణ, అక్రమాలకు శిక్ష!




సహాయం ఎవరు చేసినా సంతోషంగా ఆహ్వానిద్దాం... కానీ దాని వెనుక ఉండే ప్రయోజనాలపై మాత్రం కన్నేసి ఉంచుదాం! విదేశీ విరాళాల నియంత్రణ (ఎఫ్‌ఆర్సీఏ) సవరణ బిల్లు--2026 ఆంతర్యం ఇదే. దేశవ్యాప్తంగా బడులు, ఆస్పత్రులు, సేవా సంస్థలు, విపత్తు సహాయక చర్యలకు విదేశీ విరాళాలు ఎంతో చేయూతనందించాయి. సమాజానికి మేలు చేసిన ఆయా సంస్థల సేవలను మనం ఖచ్చితంగా గుర్తించి తీరాలి. అయితే, విదేశీ నిధులు మన దేశీయ సామాజిక, వ్యవస్థాగత పరిధిలోకి వచ్చినప్పుడు... లెక్కాజమానా లేకపోతే ఎలా? ఆ డబ్బు ఎక్కడి నుంచి వస్తున్నది? ఎక్కడికి వెళ్తున్నది? దేనికోసం ఖర్చు చేస్తున్నారు? అంతిమంగా దానివల్ల ఎవరి ప్రయోజనాలు నెరవేరుతున్నాయి?... ఇలాంటి ప్రశ్నలు స్వచ్ఛంద సంస్థలను అనుమానించాలనే ఉద్దేశంతో వేస్తున్నవి కావు. విదేశీ నిధుల ప్రవాహాన్ని క్రమబద్ధీకరించేటప్పుడు ఏ ప్రజాస్వామ్య దేశమైనా అడిగే ప్రాథమిక ప్రశ్నలు. గతేడాది మార్చి 25న లోక్‌సభ ముందుకు వచ్చిన ఈ ఎఫ్‌ఆర్సీఏ సవరణ బిల్లు, పాలనలోని ఒక ప్రధాన లోపాన్ని సరిదిద్దేందుకే రూపుదిద్దుకుంది. అంతమాత్రాన విదేశీ సహాయానికి మన దేశం తలుపులు మూసేస్తోందని కాదు. ఏదైనా సంస్థ ఎఫ్‌ఆర్సీఏ రిజిస్ట్రేషన్ రద్దయినా, దాన్ని వెనక్కి తీసుకున్నా లేదా దాని గడువు ముగిసినా... ఆ సంస్థకు చెందిన విదేశీ నిధులు, ఆస్తుల నిర్వహణపై ఒక స్పష్టమైన, చట్టబద్ధమైన విధానాన్ని ఈ బిల్లు తీర్మానిస్తుంది. ఒక సంస్థ ఎఫ్‌ఆర్సీఏ హోదా కోల్పోవడంతోనే కథ ముగిసిపోదు కదా! మరి ఆ సంస్థ కట్టిన ఆస్పత్రి ఏమవుతుంది? ఏర్పాటు చేసిన బడి పరిస్థితేంటి? విదేశీ నిధులతో సమకూరిన ఆస్తులు ఏమవుతాయి? ఆ ఆస్తులు ప్రజా సంక్షేమానికి కాకుండా వేరే దారుల్లోకి మళ్లకుండా చూసే బాధ్యత ఎవరిది? ఈ ప్రశ్నలన్నింటికీ స్పష్టమైన సమాధానమే బిల్లులోని 'నిర్దేశిత అధికారి' వ్యవస్థ. దీని ప్రకారం, మొదట ఆ ఆస్తుల పర్యవేక్షణ తాత్కాలికంగా ఈ అధికారి వద్దే ఉంటుంది. ఒకవేళ ఆ సంస్థ నిర్ణీత గడువులోగా తన లైసెన్సును పునరుద్ధరించుకున్నా లేదా కొత్త సర్టిఫికెట్ పొందినా... చట్టప్రకారం ఆ ఆస్తులను, మిగిలిన నిధులను తిరిగి ఆ సంస్థకే అప్పగిస్తారు. గడువు దాటినా పునరుద్ధరణ జరగకపోతేనే ఆ ఆస్తులు శాశ్వతంగా ప్రభుత్వం ఆధీనంలోకి వస్తాయి. వాటిని ప్రజా ప్రయోజనాల కోసమే వినియోగిస్తారు.ఆస్పత్రి అంటే కేవలం నాలుగు గోడలు కాదు. ఒక రోగికి అది పునర్జన్మ. బడి అంటే ఒట్టి భవనం కాదు. చిన్నారులకు అది రేపటి భవిష్యత్తు. వృద్ధాశ్రమం లేదా అనాథ శరణాలయం అంటే కేవలం సంస్థాగత ఆస్తి కాదు. అక్కడున్నవారికి అది కొండంత ఆసరా. అందుకే చట్టం అమలు చేసేటప్పుడు తప్పు చేసిన వారిపై చర్యలు ఉండాలే తప్ప, దానిపై ఆధారపడిన లబ్ధిదారులకు ఎలాంటి నష్టం జరగకూడదు. కఠినమైన నియమాలు ఉన్నప్పుడు చట్టబద్ధమైన ప్రక్రియ కూడా అంతే పారదర్శకంగా ఉండాలి. అందుకే ఈ చట్టంలో నిర్ణయాల సమీక్షకు, న్యాయపరమైన అప్పీలుకు తగిన అవకాశాలు కల్పించారు. నిబంధనలను ఉల్లంఘించినప్పుడు తీసుకునే చర్యలకు, వాటిని అమలు చేసే తీరులోనే అసలైన నిష్పాక్షికత ప్రతిబింబిస్తుంది. అదే సమయంలో, కావాలని చేసే అక్రమాలకు, సాంకేతిక లేదా పరిపాలనాపరమైన పొరపాట్లకు మధ్య తేడాను స్పష్టంగా చూడాలి. విదేశీ నిధులను కావాలని చట్టవిరుద్ధ పనులకు మళ్లించే సంస్థలను, కేవలం సాంకేతిక కారణాల వల్ల తప్పు చేసిన సంస్థలను ఒకేలా చూడలేం. మరొక ముఖ్యమైన అంశం 'మిశ్రమ ఆస్తులు'. ఒక సంస్థకు చెందిన ఆస్తుల్లో విదేశీ విరాళాలతో పాటు భారతీయ విరాళాలు, ప్రభుత్వ సాయం లేదా వారి సొంత ఆదాయం కూడా కలిసి ఉండవచ్చు. అందువల్ల నియంత్రణ వ్యవస్థ అనేది విదేశీ నిధులతో వచ్చిన ఆస్తులను సరిగ్గా గుర్తిస్తూనే, భారతీయ విరాళాలకు తగిన రక్షణ కల్పించేలా ఉండాలి. అలాగే, ఆరాధనా స్థలాల విషయంలో ఈ బిల్లు చూపిన చొరవ ప్రశంసనీయం. ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చిన ఆస్తుల్లో ప్రార్థనా మందిరాలు ఉన్నట్లయితే, వాటి ఆధ్యాత్మిక స్వరూపాన్ని యథాతథంగా కాపాడాలని ఈ చట్టం చెప్తున్నది. విదేశీ నిధుల విషయంలో పారదర్శకత ఎందుకు అవసరమో మన దేశ అనుభవాలే చెప్తాయి. పార్లమెంటరీ నివేదికల ప్రకారం, 2019 నుంచి 2022 మధ్య కాలంలోనే దాదాపు 13,520 సంస్థలకు సుమారు రూ.55,741 కోట్ల విదేశీ విరాళాలు వచ్చాయి. ఈ స్థాయి ఆర్థిక ప్రవాహాలు ఉన్నప్పుడు, ప్రభుత్వ పర్యవేక్షణ కేవలం చట్టబద్ధమైన బాధ్యత మాత్రమే కాదు, అత్యంత ఆవశ్యకమైన అంశం కూడా. ఇక్కడ చూడాల్సింది... నిజమైన సేవకు, దుర్వినియోగానికి మధ్య ఉన్న తేడాను! నిజాయితీతో కూడిన అంతర్జాతీయ భాగస్వామ్యానికి, మన దేశ సార్వభౌమాధికారం, భద్రత, సామాజిక సామరస్యానికి భంగం కలిగించే చర్యలకు మధ్య ఉన్న తేడాను! ఆత్మవిశ్వాసం ఉన్న భారతదేశం ప్రపంచాన్ని ఎల్లప్పుడూ ఆదరిస్తుంది. కానీ స్వేచ్ఛాయుత సమాజం రక్షణ లేని సమాజంగా మారకూడదు. పారదర్శకమైన లెక్కలున్న నిధులకు ఎలాంటి ఆటంకాలు ఉండకూడదు. కానీ అదే డబ్బు చట్టవిరుద్ధ పనులకు, వ్యక్తిగత ప్రయోజనాలకు, రాజకీయ స్వార్థానికి లేదా దేశ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టుగా మారితే మాత్రం... దాన్ని అడ్డుకునే చట్టబద్ధమైన అధికారం ప్రభుత్వానికి ఉండి తీరాలి. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలు, డిజిటల్ చెల్లింపులు పెరిగిపోయిన ఈ డిజిటల్ యుగంలో సరిహద్దులు దాటి డబ్బు మళ్లించడం చాలా తేలికైపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో మన నియంత్రణ వ్యవస్థలు కూడా కాలానికి అనుగుణంగా మారక తప్పదు. భారతదేశ సమగ్ర వికాసం, ప్రపంచ భాగస్వామ్యాలు అనేవి దేశ సార్వభౌమాధికారం, జాతీయ ప్రయోజనాల రక్షణతో సమాంతరంగా సాగాలని నమ్ముతున్నాను. జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా ఎప్పుడూ 'నేషన్ ఫస్ట్' అనే సిద్ధాంతాన్నే ముందుంచుతారు. ఇందులో భాగంగా ఈ బిల్లు మన దేశానికి ఉపయోగకరంగా ఉంటుందని విశ్వసిస్తు న్నాం. ఈ ఎఫ్‌ఆర్సీఏ సవరణ బిల్లు సరిగ్గా ఆ దిశగానే అడుగులు వేస్తున్నది.

# ఈసారీ కుల లెక్కలు గట్టెక్కలేవా?

జరిగిన ఘటనలను పునరావృతం చేయాలని చాలా మంది అనుకుంటారు. ఆశించినట్లుగా వాటిని పునరావృతం చేయలేరు. అయినా ప్రయత్నాలను ఆపరు. మానవ ప్రవర్తనలో దీన్ని సహజమే అనుకోవచ్చు. వైఫల్యాలను పునరావృతం చేయాలని మనం ఎవ్వరమూ అనుకోం. కానీ కులాల లెక్కింపు విషయంలో మాత్రం ఇప్పుడు ఆ ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటివరకూ అనధికారికంగా వెల్లడైన సమాచారాన్ని పరిశీలిస్తే దీన్నంత తేలికగా కొట్టేయలేం. దేశంలో మంచు అధికంగా ఉండే ప్రాంతాల్లో రెండో దశ జనాభా లెక్కల ప్రక్రియ త్వరలో ప్రారంభం అవుతోంది. అక్కడ జనాభా సంఖ్యతో పాటు ఏ కులానికి చెందిన ప్రజలు ఎందరున్నారన్న సమాచారాన్ని కూడా సేకరించాలి. సెప్టెంబరు ఒకటి నుంచి లద్దాఖ్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో కొన్ని ప్రాంతాల్లో ఇది జరగాలి. దాదాపు 15 రోజుల సమయమే ఇంకా మిగిలి ఉంది. ఇంతవరకూ కులాల సమాచారాన్ని ఏ విధంగా సేకరిస్తారన్న విషయాన్ని స్పష్టంచేస్తూ నోటిఫికేషన్ విడుదల చేయలేదు. గతంలో ఎప్పుడూ ఇంత జాప్యం జరగలేదు. బహుశా ప్రక్రియ ప్రారం భానికి ముందు చాలా తక్కువ వ్యవధిలో దాన్ని జారీచేస్తే వివాదాలను బాగా పరిమితం చేయగ లమన్న ఉద్దేశమే దానికి కారణం కావొచ్చు. నోటిఫికేషన్ ఆలస్యం చేస్తున్నా జనాభాగణనలో పాల్గొనే సిబ్బందికి వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వటం దాదాపుగా పూర్తయింది. శిక్షణ సందర్భంగా ఒక విషయాన్ని స్పష్టంచేశారు. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల (ఎస్సీ, ఎస్టీ) విషయంలో గతంలో చేసినట్టే ఆయా కులాల, తెగల సమాచారాన్ని సేకరిస్తారు. అంటే కేంద్ర ప్రభుత్వం గుర్తించిన రాష్ట్రాల వారీ ఎస్సీ, ఎస్టీ జాబితాను అనుసరించి ఎవరు ఏ కులానికి చెందితే అక్కడ వారి సమాచారాన్ని నమోదుచేస్తారు. తాము ఎస్సీ వర్గానికి చెందినవారమని ఒక కుటుంబం చెబితే ఆ వర్గంలో ఏ కులమో తెలుసుకుని ఫాంలో సంబంధిత బ్రాకెట్‌లో టిక్కు పెట్టుకుంటారు. ఎస్టీల విషయం లోనూ అదే చేస్తారు. మరి వెనుకబడిన కులాల (బీసీలు) విషయంలో దీన్నే చేస్తారా అంటే? ఇప్పటి వరకూ వస్తున్న సమాచారం ప్రకారం అలా చేసే అవకాశం కనపడటం లేదు. కేంద్ర జాబితాలో బీసీ కులాల సంఖ్యకు, రాష్ట్రాల జాబితాలోని బీసీ కులాల సంఖ్యకు చాలా తేడా ఉంది. ఉదాహరణకు తెలంగా ణలో రాష్ట్ర ప్రభుత్వం 133 కులాలను బీసీలుగా గుర్తిస్తే కేంద్ర జాబితాలో 90 కులాలు మాత్రమే ఉన్నాయి. మహారాష్ట్ర ప్రభుత్వం 346 కులాలను బీసీలుగా గుర్తిస్తే కేంద్రం మాత్రం 261నే పరిగణ నలోకి తీసుకుంది. కాబట్టి తన జాబితా ప్రకారం బీసీల జనాభాను కులాల వారీగా గుర్తించటానికి కేంద్రానికి ఇబ్బందులు ఉన్నాయి. ఒకవేళ అలా చేస్తే కొన్ని వందల కులాలు ఆ జాబి తాకు బయటే ఉండిపోతాయి. పోనీ రాష్ట్రాల వారీ బీసీల జాబితాను పరిగణనలోకి తీసుకుని వాటి ప్రకారం విడివిడి కులాల జనాభా లెక్కలను సేకరిస్తే వాళ్లందరినీ కేంద్ర బీసీ జాబితాలో చేర్చాలనే డిమాండు వెంటనే ఊపం దుకుంటుంది. దాన్ని ఎదుర్కొని సమస్యను పరిష్కరిం చటానికి కేంద్రం సిద్ధంగా లేదు. బీసీల వర్గీకరణకు ఏర్పాటుచేసిన జస్టిస్ రోహిణి కమిషన్ ఇచ్చిన నివేదికకే ఇంతవరకూ అతీగతీ లేదు. 2017లో ఏర్పాటైన ఆ కమిషన్‌కు నివేదిక ఇవ్వటానికే ఆరేళ్లు పట్టింది. దాని సిఫార్సులు ఏమిటో ఇప్పటికీ బయట పెట్టలేదు. రిజర్వేషన్లకు బయట ఉన్న కులాలన్నిటినీ అగ్రకులాలే అనుకుంటే అవన్నీ వివిధ రాష్ట్రాల్లో వేర్వేరు పేర్లతో ఉన్నాయి. అక్కడి ఎస్సీ, ఎస్టీ, బీసీ జాబితాలను పరిగణనలోకి తీసుకుని ప్రతి రాష్ట్రానికి నిర్దిష్టంగా అగ్రకుల జాబితానో, నాన్ రిజర్వేషన్ కేటగిరీ జాబితానో రూపొందించాలి. దీనికి కేంద్రం ఆమోదముద్ర వేయాలి. దానికీ ఇప్పటికిప్పుడు సిద్ధంగా లేదని తెలుస్తోంది.ఈ సమస్యలన్నిటినీ దృష్టిలో ఉంచుకుని గతాన్నే పునరావృతం చేయాలన్న నిర్ణయానికి కేంద్రం వచ్చినట్లు తెలుస్తోంది. 2011లో ఆనాటి యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (యూపీఏ) ప్రభుత్వం బీసీ జనాభా ఎంతో తేల్చాలన్న డిమాండుకు తలవొగ్గి సామాజిక, ఆర్థిక, కుల గణన (ఎస్ఈసీసీ)ను చేపట్టింది. ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ పెద్దను తమ కులం ఏమిటో చెప్పాల్సిందిగా కోరింది. తమ కులం పేరు గురించి తాము ఏమను కుంటున్నారో అదే పొల్లుపోకుండా వారు చెప్పారు. వారు ఏది చెబితే దాన్ని గణన సిబ్బంది రాసుకున్నారు. కొందరు ప్రధాన కులం పేరు చెప్పారు. మరికొందరు ఉపకు లం పేరు చెప్పారు. కులానికి చెందిన ప్రాంత నామా న్ని చెప్పినవారూ ఉన్నారు. గోత్రాన్ని చెప్పటా నికే కొందరు పరిమిత మయ్యారు.




చాలా మంది తాము ఫలానా వారమని ఇంటిపేర్లు చెప్పారు. ఇట్లా ప్రజలు ఏది చెబితే దాన్ని నమోదు చేసుకున్నారు. వాటన్నిటినీ పరిశీలిస్తే 45 లక్షల పైచిలుకు పేర్లు వచ్చాయి. ఇవన్నీ మీ కులం ఏమిటి? అన్న సాధారణ ప్రశ్నకు వచ్చిన స్పందనలు. ఇట్లా ఎందుకు నమోదు చేసారం టే, ప్రజలు తమ కులం గురించి తాము చెప్పుకున్న దాన్నే ప్రామా ణికంగా తీసుకోవాలనీ, మీది ఫలానా కులమని చెప్పాలని ప్రభుత్వం వారిని బలవంతం చేయలేదనీ సమర్థించుకున్నారు. ప్రజలు చెప్పినదాన్ని యథాత థంగా నమోదుచేస్తే చిక్కులు రావా? అన్న ప్రశ్న ఆనాడూ వచ్చింది.

# బీజేపీ సీనియర్ నాయకులు సీలోజు పాండు చారి మృతి పట్ల వడ్డేపల్లి రాజేశ్వరరావు సంతాపం





( ఆగస్టు -14- హంసకలం వార్త )

బీజేపీ సీనియర్ నాయకులు, పార్టీ వ్యవస్థాపక సభ్యులు సీలోజు పాండు చారి మృతి పట్ల రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. పాండు చారి నివాసానికి వెళ్లి పార్థివదేహానికి నివాళు లర్పించారు. బీజేపీ బలోపేతానికి, పార్టీ సిద్ధాంతాల కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన మృతి పార్టీకి, కుటుంబ సభ్యులకు తీరని లోటని అన్నారు. అనంతరం మృతుని కుమారుడు, మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు సీలోజు శ్రవణ్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

# కార్యకర్త నూతన గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు





( ఆగస్టు -14- హంస కలంవార్త )

కూకట్‌పల్లి బీజేపీ సీనియర్ నాయకులు బైలూరి ఉదయ్ కుమార్ నూతన గృహప్రవేశ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వారి ఆహ్వానం మేరకు రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు కార్యక్రమానికి హాజరయ్యారు. నూతన గృహంలో నిర్వహించిన శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శిం చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఉదయ్ కుమార్ దంపతులను అభినం దించి శు భాకాంక్షలు తెలిపారు. సత్యనారాయణ స్వామివారి ఆశీస్సులతో వారి కుటుంబం సుఖసంతో షాలతో, ఆయురా రోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లా లని రాజేశ్వర రావు ఆకాంక్షించారు.

# ఎస్ఐఆర్-2026లో సేవలందించిన కాంగ్రెస్ నాయకులకు సన్మానం





( ఆగస్టు -14- హంస కలంవార్త )

ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ సూచనల మేరకు నిర్వహించిన ఎస్ఐఆర్-2026 కార్యక్రమ ంలో పాల్గొన్న బౌరంపేట్, దుండిగల్, బహదూర్‌పల్లి, కొంపల్లి, దూలపల్లి, సుభాష్‌నగర్, సాయిబాబా నగర్ డివిజన్‌ల కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు, సీనియర్ నాయకులను మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమ ంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ మిథున్ రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జ్ కొలను హనుమంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన బీఎల్ఏలు, సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులకు భూపతిరెడ్డి అభినందనలు తెలిపారు.

# అల్విన్ కాలనీలో ఘనంగా తిరంగా ర్యాలీ





( ఆగస్టు -14- హంస కలంవార్త )

శేర్లింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని అల్విన్ కాలనీ ఎస్ఎస్‌డీ గ్రామర్ హైస్కూల్‌లో దేశభక్తిని చాటుతూ తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. చెన్నమనేని స్రవంతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీందర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణ నుంచి నిర్వహించిన తిరంగా ర్యాలీలో జాతీయ జెండాలను చేతబూనిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, నాయకులు, స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. దేశభక్తి నినాదాలతో అల్విన్ కాలనీ పరిసర ప్రాంతాలు మారుమ్రోగాయి. ఈ కార్యక్రమంలో కేశవరావు , నరేందర్ రెడ్డి , రామరాజు , మణిభూషణ్ , రాజు , గోపాల్ రావు , పీవీ సుబ్బారావు , కుమారచారి , కమల్ , నరసింహారెడ్డి అంజి , ప్రకాష్ , జై ప్రకాష్ , భరత్ , కార్తీక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పాఠశాల ఉపాధ్యా యులు, విద్యార్థినీ విద్యార్థులు, సామాన్య ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జాతీయ జెండాకు గౌరవం తెలిపారు. దేశ సమైక్యత, జాతీయత, దేశభక్తి సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేలా ఈ



తిరంగా ర్యాలీ సాగింది."దేశం ముందు -- దేశభక్తి మనందరి బాధ్యత" అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం అందరిలోనూ స్ఫూర్తిని నింపింది.

# ఉప్పల్ జోన్‌లో కమిషనర్ విస్తృత క్షేత్రస్థాయి తనిఖీలు



( ఆగస్టు -14- హంస కలంవార్త)



పారిశుద్ధ్యం, నాలాల అభివృద్ధి, రహదారులు, హరితీకరణపై కీలక ఆదేశాలు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణ రెడ్డి, ఐఏఎస్ ఉప్పల్, దేవేందర్ నగర్, GSI రోడ్, సరోజ్‌నగర్ చెరువు తదితర ప్రాంతాల్లో శుక్రవారం విస్తృతంగా క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. పారిశుద్ధ్యం, నాలాల అభివృద్ధి, దోమల నియంత్రణ, రహదారుల నిర్వహణ, హరితీకరణతో పాటు కొనసాగుతున్న మౌలిక వసతుల పనుల పురోగతిని పరిశీలించారు.ఈ తనిఖీల్లో సంబంధిత జోనల్ కమిషనర్లు, డీసీలు, ఈఈలు, డీఈలు, డిప్యూటీ ఈఈలు, ఏఈలు, యు బి డి అధికారులు, రామ్‌కీ ప్రతిని ధులు తదితరులు పాల్గొన్నారు.

**-నాలా పనులు వేగవంతం చేయాలి**

దేవేందర్ నగర్‌లో నాగోల్ మెట్రో స్టేషన్ నుంచి అంబర్‌పేట్ ఎస్‌టీపీ వరకు నాలా వెంబడి కొనసాగుతున్న డీ-సిల్టింగ్, ఫెన్సింగ్ పనులను కమిషనర్ పరిశీలించారు. పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.నాలా పరిసరాల్లో పేరుకుపోయిన సి ఞ డి వ్యర్థాలను వెంటనే తొలగించి, నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. శ్రీ రామనాపురం ప్రాంతంలో గుంతల పూడ్చివేత, రహదారి ప్యాచ్‌వర్క్ పనులను పరిశీలించి, ప్రజలకు సురక్షితమైన రాకపోకలు కల్పించేలా మరమ్మతులను వేగవంతం చేయాలని ఆదేశించారు.రహదారి నిర్వహణకు అవసరమైన షెల్‌మాక్ బ్యాగులు, ఇతర మెటీరియల్ తగినంతగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**-జి ఎస్ ఐ రోడ్డులో ఆక్రమణలు తొలగించాలి**

జి ఎస్ ఐ రోడ్డులో రహదారి పరిస్థితులు, పారిశుద్ధ్యం, రోడ్ మార్జిన్లను కమిషనర్ పరిశీలించారు. ప్రజల రాకపోకలకు అడ్డంకిగా ఉన్న ఆక్రమణలు, ఇతర అవరోధాలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. రహదారి వెంట ఉన్న లిగర్భజ్ ఉలనెరేబుల్ పాయింట్స్ ( జివిపిఎస్ )లను పూర్తిగా నిర్మూలించి, తిరిగి చెత్త పేరుకుపోకుండా నిరోధక చర్యలు చేపట్టాలని సూచించారు. రోడ్ మార్జిన్లలో అనువైన ప్రాంతాలను గుర్తించి మొక్కలు నాటి, వాటిని క్రమం తప్పకుండా నిర్వహించాలని యు బి డి విభాగాన్ని ఆదేశించారు.పచ్చదనం పెంపుతో పరిసరాల సౌందర్యం మెరుగుపడటంతో పాటు అక్రమంగా చెత్త పారవేయడాన్ని కూడా నిరోధించవచ్చని కమిషనర్ పేర్కొన్నారు.

**-సరోజ్‌నగర్ చెరువు వద్ద దోమల నియంత్రణకు చర్యలు**

సరోజ్‌నగర్ చెరువులో కొనసాగుతున్న వాటర్ హయాసింత్ తొలగింపు పనులను కమిషనర్ పరిశీలించారు. దోమల వృద్ధికి అవకాశం కల్పించే పరిస్థితులను తగ్గించేందుకు నీటి కలుపు తొలగింపు పనులను ప్రాధాన్యతతో కొనసాగించాలని ఆదేశించారు. చెరువు పరిసరాల్లో క్రమం తప్పకుండా యాంటీ లార్వల్ ఆపరేషన్స్ ( ఏ ఎల్ వో) నిర్వహించాలని, అవసరమైన ప్రాంతాల్లో ఫాగింగ్ చేపట్టాలని సూచించారు. చెరువు పరిసరాల్లో చెత్త పేరుకుపోకుండా నిరంతర పారిశుద్ధ్య చర్యలు చేపట్టి ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**-ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు వేగవంతం చేయాలి**

ఉప్పల్ ఎక్స్‌రోడ్‌లో కొనసాగుతున్న ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి పురోగతిని సమీక్షించారు. నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని పెంచి పనుల పురోగతికి ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. నిర్మాణ పనుల సమయంలో ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు తగ్గేలా అవసరమైన ట్రాఫిక్, నిర్వహణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఉప్పల్ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, వాహనాల సాఫీ రాకపోకలకు మార్గం సుగమం చేయడం, మెరుగైన రవాణా అనుసంధానాన్ని కల్పించడంలో ఎలివేటెడ్ కారిడార్ కీలక పాత్ర పోషిస్తుందని కమిషనర్ పేర్కొన్నారు.

**-నాణ్యతతో పనులు పూర్తి చేయాలి**

నాలాల అభివృద్ధి నుంచి రహదారి మరమ్మతులు, చెరువుల సంరక్షణ నుంచి హరితీకరణ, పారిశుద్ధ్యం నుంచి ప్రధాన మౌలిక వసతుల ప్రాజెక్టుల వరకు అన్ని పనులను సమన్వయంతో, నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని కమిషనర్ సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన పౌర సౌకర్యాలు, పరిశుభ్రమైన పరిసరాలు, సురక్షితమైన రహదారులు, మెరుగైన రవాణా సదుపాయాలు అందించడమే మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు.



# ప్రశాంత్‌నగర్, కేపీహెచ్‌బీలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ






(ఆగస్టు -14- హంస కలంవార్త )

దేశభక్తి నినాదాలతో మార్మోగిన కూకట్‌పల్లి నియోజకవర్గం కూకట్‌పల్లి: భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమంలో భాగంగా కూకట్‌పల్లి నియోజక వర్గంలోని ప్రశాంత్‌నగర్, కేపీహెచ్‌బీ డివిజన్‌లలో శుక్రవారం ఘనంగా తిరంగా ర్యాలీలు నిర్వహిం చారు. ప్రశాంత్‌నగర్ డివిజన్‌లో యాంజాల పద్మయ్య గారి ఆధ్వర్యంలో, కేపీహెచ్‌బీ డివిజన్‌లో ప్రీతం రెడ్డి ఆధ్వర్యంలో ఈ ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని చేతబూని నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, స్థానిక ప్రజలు పాల్గొని చేతుల్లో త్రివర్ణ పతాకాలను పట్టుకుని "భారత్ మాతాకీ జై", "వందే మాతరం" వంటి దేశభక్తి నినాదాలతో ర్యాలీని విజయవంతం చేశారు. భారీ జాతీయ పతాకంతో నిర్వహించిన ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు గారు మాట్లాడుతూ, "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమం ప్రతి ఇంటిలో దేశభక్తి స్ఫూర్తిని నింపడంతో పాటు, దేశం పట్ల ప్రతి పౌరుడి బాధ్యతను గుర్తుచేసే గొప్ప కార్యక్రమమని అన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి, ప్రతి ఒక్కరూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఆయన అన్నారు. దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడ టంతో పాటు దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. దేశభక్తి, జాతీయ



సమైక్యతను చాటుతూ నిర్వహి ంచిన ఈ తిరంగా ర్యాలీలు కూకట్‌పల్లి నియోజ కవర్గంలో ఉత్సాహభరిత వాతావరణాన్ని నింపాయి.

# దేవాలయ భూముల కబ్జాలను అడ్డుకోవాలి: జనసేన

ఆగస్టు -14- హంస కలంవార్త

కుత్బుల్లాపూర్‌లో ఎమ్మార్వో కార్యాలయంలో ఫిర్యాదు కుత్బుల్లాపూర్: జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని కొండమీద ఉన్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయా నికి సంబంధించిన భూముల ఆక్రమణలను వెంటనే అడ్డుకోవాలని జనసేన పార్టీ డిమాండ్ చేసింది. ఆలయానికి చెందిన భూములను కొంతమంది స్థానిక రాజకీయ నాయకుల అండదండలతో కొందరు వ్యక్తులు ఇష్టానుసారంగా ఆక్రమణలకు పాల్పడు తున్నారని జనసేన పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నందగిరి సతీష్ ఆరోపించారు. ఆక్రమణకు గురవుతున్న స్థలాల్లో భూమిపూజలు నిర్వహిస్తూ కబ్జాలకు పాల్పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి స్వార్థపూరిత చర్యలను అడ్డుకోకపోతే రాబోయే రోజుల్లో ఆలయానికి సంబంధించిన ఖాళీ స్థలం కూడా కనిపించకుండా పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆలయ భూముల రక్షణకు అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని, ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ మేరకు నందగిరి సతీష్ కుత్బుల్లాపూర్ ఎమ్మార్వో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో నైబ్ తహసీల్దార్ సుధాకర్ కి ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఆలయ భూముల పరిరక్షణకు అధికారులు సమగ్రంగా విచారణ జరిపి, భూముల హద్దులను నిర్ధారించి, భవిష్యత్తులో ఎలాంటి



ఆక్రమణలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కెపిహెచ్బి 22ఏ సమస్యపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పోరాటం

( ఆగస్టు -14- హంసకలం వార్త)

సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాడతా: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కూకట్‌పల్లి: సిపిహెచ్బి డివిజన్ పరిధిలోని పలు కాలనీలను 22ఏ సెక్షన్‌లో చేర్చడం వల్ల స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న రిజిస్ట్రేషన్, నిర్మాణ అనుమతుల సమస్యలపై కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు కార్యాలయంలో కెపిహెచ్బి డివిజ న్‌కు చెందిన కాలనీ అసోసియేషన్ సభ్యులతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. ముఖ్యంగా సర్దార్ పటేల్ నగర్, భగత్ సింగ్ నగర్, వసంత్ నగర్, సి బి సి ఐ డి కాలనీ తదితర ప్రాంతాలను 22ఏ సెక్షన్‌లో చేర్చడం వల్ల అక్కడి ప్రజలకు ఇబ్బందులు ఎదురవు తున్నాయని అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువ చ్చారు. భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోవ డంతో పాటు, భవన నిర్మాణాలకు అనుమతులు పొంద డంలో కూడా తీవ్ర సమస్యలు ఎదురవుతు న్నాయని వారు వివరించారు. ఈ సమస్యపై గురువా రం కే పి హెచ్ బి లో జరిగిన బహిరంగ సభలో ముఖ్య మంత్రి శ్రీ రేవంత్ రెడ్డి , మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి, మంత్రి సానుకూలంగా స్పందించారని, సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుం టామని హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. "అతి త్వరలోనే 22ఏ సమస్యకు పరిష్కారం లభించేలా కృషి చేస్తాను. సమస్య పరిష్కారం అయ్యే వరకు ప్రజల తరఫున పోరాడుతాను. అవసరమైతే నిరసన దీక్షకు కూడా సిద్ధంగా ఉన్నాను" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ అంశంపై టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వంతో పోరాడి ప్రజలకు న్యాయం జరిగేలా సమస్యకు పరిష్కారం తీసుకువస్తామని వారు కూడా పేర్కొన్నారని అన్నారు. ఖాళీ స్థలాలను ప్రజా అవసరాలకు వినియోగించాలి

కెపిహెచ్బి గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఖాళీ స్థలాలను ప్రజలకు ఉపయోగపడే విధంగా పార్కులు, క్రీడా ప్రాంగణాలుగా అభివృద్ధి చేశామని మాధవరం కృష్ణారావు గుర్తుచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కెపిహెచ్బి లో ఉన్న చిన్నచిన్న ఖాళీ స్థలాలను సైతం వేలం వేసి విక్రయిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఖాళీ స్థలాలను పార్కులు, క్రీడా ప్రాంగణాలు,







ఇతర ప్రజా అవసరాలకు వినియోగించేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కెపిహెచ్బి డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, సెక్రటరీ రాజేష్ రాయ్, వివిధ కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పేదలపై ప్రేమ ఉంటే ఉచితంగా ఇండ్లు నిర్మించి ఇవ్వాలి: తలసాని

**-ఇందిరమ్మ ఇండ్ల పేరుతో పేదల నుంచి డబ్బులు వసూలు చేయడం సరికాదు**




(ఆగస్టు-14- హంస కలంవార్త )

కాంగ్రెస్ ప్రభుత్వానికి పేద ప్రజలపై ఏమాత్రం ప్రేమ ఉన్నా అర్హులైన పేదలకు ఉచితంగా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పేదలు ఆత్మగౌరవంతో జీవించాలనే ఉద్దేశంతో దేశంలో ఎక్కడా లేని విధంగా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ 560 గజాల స్థలంలో అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించి ఇచ్చారని తెలిపారు. జిహెచ్‌ఎంసి పరిధిలోని 109 ప్రాంతాల్లో లక్ష డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టి, వాటిలో 69 వేల ఇళ్లను అర్హులైన పేదలను పారదర్శ కంగా గుర్తించి అందజేశామని చెప్పారు. కోట్లాది రూపాయల విలువైన స్థలాల్లో పేదల కోసం ఇళ్లను నిర్మించి ఇచ్చామని పేర్కొన్నారు. "బీఆర్ఎస్ ప్రభుత్వం ఇళ్లు ఎక్కడ నిర్మించిందని ముఖ్యమంత్రి ప్రశ్నిస్తున్నారు. మా వెంట వస్తే తీసుకెళ్లి మేము నిర్మించిన ఇళ్లను చూపిస్తాం" అని తలసాని శ్రీనివాస్ యాదవ్ సవాల్ చేశారు. కొల్లూరు ప్రాంతంలో ఒకేచోట 16 వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించామని, ఆసియా ఖండంలోనే అత్యధిక గృహ సముదాయాల్లో ఒకటిగా అది నిలిచిందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన ఇళ్లకు విద్యుత్, డ్రైనేజీ, రోడ్లు, లిఫ్ట్‌లు, తాగునీరు తదితర అన్ని మౌలిక -పేదల నుంచి డబ్బులు వసూలు చేయడం సరికాదు కేసీఆర్ ప్రభుత్వం ఉచితంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించినప్పటికీ వాటిపై తమ పేర్లు పెట్టుకోలేదని తలసాని అన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం లబ్ధిదారుల నుంచి రూ.6 లక్షలు తీసుకుంటూ వాటికి ఇందిరమ్మ ఇళ్లు అని పేరు పెట్టుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇళ్లను ఎన్ని గజాల స్థలంలో నిర్మిస్తారో ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకునే సమయంలోనే రూ.10 వేల చెల్లించాలని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇళ్ల కోసం పేదలు చెల్లించిన డబ్బులు ఇప్పటివరకు తిరిగి రాలేదని ఆయన పేర్కొన్నారు.

**-22ఏ పేరుతో పేదల భూములపై ఆంక్షలు ఎందుకు?**

22ఏ నిబంధనలను తీసుకొచ్చి పేదల భూములపై ఆంక్షలు విధించి, ఇప్పుడు వారి భూములను వారికే ఇప్పిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని తలసాని విమర్శించారు. "పేద ప్రజల భూములు, ఇళ్లను 22ఏలో పెట్టే అధికారం మీకు ఎవరు ఇచ్చారు?" అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 22ఏ నిబంధనలను అడ్డం పెట్టుకుని 30 నుంచి 40 శాతం వరకు పర్సెంటేజీల దందా ఎవరు చేస్తున్నారో అందరికీ తెలుసని ఆరోపించారు. త్వరలోనే వారి వివరాలను బయటపెడతామని అన్నారు.

**-దేవుళ్లకు పూజలు చేస్తే క్షుద్ర పూజలా?**

రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని తాము దేవుళ్లకు పూజలు చేస్తే, వాటిని క్షుద్ర పూజలుగా అభివర్ణించడం ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తికి తగదని తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధాకరమని పేర్కొన్నారు.

**-తెలంగాణ భవన్‌కు 20 ఏళ్లు**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన ఉద్యమానికి ఒక వేదికగా ఉండాలనే ఉద్దేశంతో తెలంగాణ భవన్‌ను నిర్మించుకున్నామని తలసాని తెలిపారు. తెలంగాణ భవన్ నిర్మాణం పూర్తయి 20 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ భవన్ అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తూ, వారి సమస్యలపై పోరాడే వేదికగా మారిందని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తూ, ప్రజల పక్షాన నిలబడే "జనతా గ్యారేజీ"గా తెలంగాణ భవన్ మారిందని తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు.

## స్వాతంత్ర వేడుకలకు ముస్తాబైన కలెక్టర్ కార్యాలయం

( ఆగస్టు -14- హంసకలం వార్త)



కామారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఆవరణలో శనివారం స్వాతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించుటకు ప్రభుత్వం ఏర్పాట్లు ముమ్మరంగా చేసింది. కార్యాలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు స్వతంత్ర వేడుకలలో ముఖ్యఅతిథిగా ప్రభుత్వ సలహాదారు హనుమ ంతరావు పాల్గొంటారు. జిల్లా కలెక్టర్ అదన కలెక్టర్లు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు జిల్లా అధికారులు పాల్గొంటారు.

# పేదల ముఖాల్లో చిరునవ్వులే స్వాతంత్ర్యానికి నిజమైన అర్థం: భట్టి విక్రమార్క






( ఆగస్ట్-14- హంస కలంవార్త )

తెలంగాణ ప్రజలకు, యావత్ దేశ ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు హైదరాబాద్: తెలంగాణ ప్రజలకు, యావత్ దేశ ప్రజలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితంగా మన దేశానికి స్వాతంత్ర్యం లభించిందని, వారి త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి పేద కుటుంబం ఆత్మగౌరవంతో జీవించేలా, ప్రతి రైతు సంతోషంగా ఉండేలా, ప్రతి యువతకు భవిష్యత్తుపై భరోసా కలిగేలా తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజా ప్రభుత్వం దృఢ సంకల్పంతో పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్లు, రైతులకు అండగా రైతుభరోసా, మహిళల ఆర్థిక సాధికారత, యువతకు ఉపాధి అవకాశాల కల్పనతో పాటు విద్య, వైద్యం, సామాజిక భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. "పేదవాడి ఇంట్లో వెలుగు నిండినప్పుడే స్వాతంత్ర్యానికి నిజమైన అర్థం ఉంటుంది. ప్రతి కుటుంబం గౌరవంగా జీవించే తెలంగాణ నిర్మాణమే మా ప్రభుత్వ సంకల్పం" అని భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతి ఫలాలు సమాజంలోని చివరి పేదవాడి ఇంటికి చేరినప్పుడే అభివృద్ధికి అసలైన అర్థం ఉంటుందని పేర్కొన్నారు. ఆ దిశగా ప్రతి వర్గానికి అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించాలనే కృతనిశ్చయంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాలకు అనుగుణంగా సామాజిక న్యాయం, సమానత్వం, సంక్షేమం, అభివృద్ధి లక్ష్యాలతో తెలంగాణను మరింత బలమైన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. తెలంగాణ ప్రజల ఆశీస్సులతో పేదల ముఖాల్లో చిరునవ్వులు, ప్రతి ఇంటా వెలుగులు నింపే దిశగా ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం మరింత బలంగా ముందుకు సాగుతుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఈ స్వాతంత్ర్య దినోత్సవం ప్రతి తెలంగాణ కుటుంబంలో కొత్త ఆశలు, కొత్త



వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తూ దేశ ప్రజలందరికీ ఆయన హృదయపూర్వక స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# పూలే దంపతుల విగ్రహావిష్కరణ చరిత్రలో నిలిచిపోయే ఘట్టం: మంత్రి కొండా సురేఖ





(ఆగస్ట్-14- హంస కలం వార్త)

సమానత్వం, విద్య, సామాజిక న్యాయానికి పూలే దంపతులు ప్రతీకలు హైదరాబాద్: మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే దంపతుల విగ్రహాలను ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి చేతుల మీదుగా ఆవిష్కరించుకోవడం ఎంతో గర్వకారణమని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ అన్నారు. హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో నిర్వహిం చిన మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే దంపతుల విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. పూలే దంపతుల విగ్రహావి ష్కరణ కార్యక్రమం చరిత్రలో నిలిచిపోయే గొప్ప ఘట్టమని ఆమె పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే గొప్ప సంఘ సంస్కర్త, సామాజికవేత్త అని, సమాజంలో వేళ్లూనుకున్న కుల వివక్ష, సామాజిక అసమానతలు, అంటరానితనానికి వ్యతిరేకంగా జీవితాంతం పోరాడారని మంత్రి తెలిపారు. అణగారిన వర్గాలకు విద్యను అందించడంతో పాటు ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, అవకాశాలు కల్పించాలనే ఆశయంతో ఆయన పనిచేశారని అన్నారు. ఆ రోజుల్లో మహిళలను విద్యకు దూరంగా ఉంచుతున్న పరిస్థితుల్లో మహిళలు కూడా తప్పనిసరిగా చదువుకోవాలనే గొప్ప ఆలోచనను సమాజంలోకి తీసుకువచ్చిన ఘనత పూలే దంపతులకు దక్కుతుందని మంత్రి అన్నారు. జ్యోతిరావు పూలే తన భార్య సావిత్రీబాయి పూలేను ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్ది, బాలికలకు విద్య అందించేలా ప్రోత్సహించారని, బాలికల కోసం పాఠశాలలను ప్రారంభించి మహిళా విద్యకు బలమైన పునాది వేశారని తెలిపారు. మహిళల హక్కుల పరిరక్షణ, వితంతువుల పరిస్థితి మెరుగుదల, మహిళల గౌరవం కోసం పూలే దంపతులు చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. సమానత్వం, విద్య, సామాజిక న్యాయం కోసం వారు చేసిన పోరాటం నేటి తరాలకు కూడా స్ఫూర్తిదాయకమని కొండా సురేఖ పేర్కొన్నారు.

**-బీసీల అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం కట్టుబాటు**

బీసీల సంక్షేమం, అభ్యున్నతికి ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత శ్రీ రాహుల్ గాంధీ కూడా బీసీలను సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి తీసుకురావాలనే సంకల్ప ంతో ముందుకు సాగుతున్నారని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ఈ అంశంపై కేంద్రానికి ప్రతిపాదనలు పంపిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని మంత్రి తెలిపారు. బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం సహా అన్ని రంగాల్లో సముచిత అవకాశాలు కల్పించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు.

**-విద్య, మహిళా సాధికారతకు ప్రాధాన్యత**

పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని కొండా సురేఖ తెలిపారు. పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు యూనిఫాంలు, పుస్తకాలు అందించడంతో పాటు విద్యార్థుల హాజరు పెంచేందుకు బ్రేక్‌ఫాస్ట్, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు మెరుగైన విద్యా ప్రమాణాలతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు, పోషకాహారం, ఇతర సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. మహిళలు, బాలికలు ఉన్నతంగా చదువుకుని జీవితంలో ముందుకు సాగాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. "ఒక బాలిక చదువుకుంటే ఒక కుటుంబం మాత్రమే కాకుండా మొత్తం సమాజం అభివృద్ధి చెందుతుంది" అని మంత్రి పేర్కొన్నారు. మహిళా విద్య ద్వారా సాధికారత సాధించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

**-పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం**

పేద, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ కార్యక్రమాల ద్వారా పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు. నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని అన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం, విద్య, మహిళా సాధికారత కోసం పూలే దంపతులు చూపిన మార్గంలోనే రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.పూలే దంపతుల ఆశయాలను కొనసాగిస్తూ బీసీలు, అణగారిన వర్గాలకు మరిన్ని అవకాశాలు కల్పించి, వారిని రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములను చేయడమే ప్రభుత్వ సంకల్పమని మంత్రి స్పష్టం చేశారు.

**-విగ్రహాలు ఆశయాలకు ప్రతీకలు**

పూలే దంపతుల విగ్రహాలను ప్రతిష్ఠించి, వారి సేవలను స్మరించుకునే గొప్ప అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి వేదిక మీదుగా మంత్రి కొండా సురేఖ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.విగ్రహావిష్కరణ ద్వారా పూలే దంపతుల ఆశయాలను భవిష్యత్ తరాలకు చేరువ చేసే గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని అన్నారు. ఈ విగ్రహాలు కేవలం మహనీయుల ప్రతిరూపాలు మాత్రమే కాదని, సమానత్వం, విద్య, మహిళా సాధికారత, సామాజిక న్యాయానికి ప్రతీకలు అని మంత్రి పేర్కొన్నారు.మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే చూపిన మార్గంలో నడుస్తూ తెలంగాణను మరింత సమగ్రంగా, సమానత్వంతో కూడిన గొప్ప రాష్ట్రంగా తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంకల్పమని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు.

# కమలాపురం రామాలయంలో ఘనంగా తొలి శ్రావణ శుక్రవార పూజలు

(ఆగస్ట్-14- హంస కలం వార్త)

మంగపేట మండలం కమలాపురం గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో తొలి శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు కన్నులపండువగా నిర్వహించారు. శ్రావణ మాసం ప్రారంభం కావడంతో ఆలయంలో ఉదయం నుంచే ఆధ్యాత్మిక శోభ విలసిల్లింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వంశీఆచార్యులు పర్యవేక్షణలో మహిళలతో ప్రత్యేక సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, నిష్టతో స్వామివారికి అర్చనలు చేసి, తమ సౌభాగ్యం, కుటుంబ క్షేమం కలగాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులకు, పూజలో పాల్గొన్న మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేశారు. పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన



మహిళలు, భక్తులు మరియు ఆలయ నిర్వాహకులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్లు, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి శాఖల సమన్వయం

**-176 గుంతలపై ప్రత్యేక దృష్టి.. 24 ఫ్రీ లెఫ్ట్‌లు, 188 వాటర్ లాగింగ్ పాయింట్లపై సమీక్ష**



( ఆగస్టు -14- హంస కలంవార్త )

మల్కాజ్‌గిరి, ఆగస్టు 14: మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ట్రాఫిక్ రద్దీ, రహదారి భద్రత, గుంతలు, ఆక్రమణలు, నీటి నిల్వలు, నాలాల అభివృద్ధి, ప్రధాన మౌలిక వసతుల పనులపై మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్, మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎంఎంసీ కమిషనర్ శ్రీ టి. వినయ్ కృష్ణా రెడ్డి, ఐఏఎస్, మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ శ్రీమతి సుమతి, ఐపీఎస్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొని ప్రధాన సమస్యలపై సమగ్రంగా చర్చించారు. సమావేశంలో రోడ్లు, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు, గుంతలు, ఫ్రీ లెఫ్ట్‌ల అభివృద్ధి, రోడ్ సేఫ్టీ, వాటర్ లాగింగ్ పాయింట్లు, నాలాల అభివృద్ధి, ప్రధాన మౌలిక వసతుల ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు.

**-176 గుంతలపై ప్రత్యేక దృష్టి**

ట్రాఫిక్ పోలీసుల ద్వారా గుర్తించిన 176 గుంతలు, రహదారి దెబ్బతిన్న ప్రాంతాల్లో 171 ప్రాంతాలు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనే ఉన్నట్లు సమావేశంలో వెల్లడైంది. మొత్తం 77 ప్రాంతాలను మేజర్ కేటగిరీగా గుర్తించగా, వాటిలో 66 ప్రాంతాలు జోన్-1 పరిధిలో ఉన్నట్లు అధికారులు తెలిపారు.ఆయా ప్రాంతాల్లో ప్యాచ్‌వర్క్, రహదారి మరమ్మతులను ప్రాధాన్యతతో చేపట్టి, పనులు పూర్తయిన అనంతరం ట్రాఫిక్ పోలీసులతో సంయుక్తంగా క్షేత్రస్థాయి ధృవీకరణ చేపట్టాలని ఆదేశించారు.

**-ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు 24 ఫ్రీ లెఫ్ట్‌లు**

సిగ్నల్ జంక్షన్ల వద్ద వాహనాల రద్దీని తగ్గించి, ఎడమవైపు తిరిగే వాహనాలకు సులభమైన రాకపోకలు కల్పించేందుకు 24 ప్రాంతాల్లో ఫ్రీ లెఫ్ట్ అభివృద్ధి ప్రతిపాదనలు గుర్తించినట్లు సమావేశంలో సమీక్షించారు. వీటిలో ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోనే ఆరు ప్రాంతాలు ఉన్నాయి. ఉప్పల్ ఎక్స్ రోడ్స్, హబ్సిగూడ ఎక్స్ రోడ్స్, సర్వే ఆఫ్ ఇండియా, స్నేహపురి జంక్షన్ తదితర ప్రాంతాల్లో సిగ్నల్ వెయిటింగ్, రహదారి వెడల్పు, జంక్షన్ సామర్థ్యం వంటి అంశాలను పరిశీలించాలని సూచించారు.

**-ఉప్పల్ జోన్‌లో 98 రోడ్ సేఫ్టీ పనులు**

ఉప్పల్ జోన్‌లో ట్రాఫిక్ పోలీసులతో సంయుక్తంగా గుర్తించిన 98 రోడ్ సేఫ్టీ పనులపై కూడా సమీక్ష జరిగింది. వీటిలో 45 జంక్షన్ మార్కింగ్స్, ట్రాఫిక్ కాల్మింగ్ చర్యలు, 11 విద్యుత్ స్తంభాల మార్పిడి, 10 ఆక్రమణల తొలగింపు, 9 చెట్ల కొమ్మల తొలగింపు, 7 స్ట్రీట్ లైటింగ్ పనులు తదితర చర్యలు ఉన్నాయి.మొత్తం 98 ప్రాంతాల్లో ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తయిందని అధికారులు తెలిపారు. అంచనాల తయారీ అనంతరం పనులను వేగంగా ప్రారంభించాలని కమిషనర్ ఆదేశించారు.

**-188 వాటర్ లాగింగ్ పాయింట్లపై దృష్టి**

కార్పొరేషన్ పరిధిలో గుర్తించిన 188 వాటర్ లాగింగ్ పాయింట్లలో 90 ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం ఇంకా గుర్తించాల్సి ఉందని సమావేశంలో సమీక్షించారు.సంబంధిత నాలాలు, స్టార్మ్ వాటర్ డ్రెయిన్ల సామర్థ్యాన్ని పెంచేలా డీ-సిల్టింగ్ పనులను ప్రాధాన్యతతో చేపట్టి, కొనసాగుతున్న నాలా అభివృద్ధి పనులతో సమన్వయం చేయాలని సూచించారు.మొత్తం 9 నాలా, స్టార్మ్ వాటర్ డ్రెయిన్ పనుల్లో 6 పనులు పురోగతిలో ఉండగా, ఒక పని పూర్తయిందని, మిగిలిన పనులు టెండర్, భూసేకరణ తదితర దశల్లో ఉన్నట్లు అధికారులు వివరించారు.

**-ఆక్రమణల తొలగింపునకు సమన్వయ చర్యలు**

ప్రధాన రహదారులు, ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగించి ప్రజలు, వాహనదారులకు ఎలాంటి ఆటంకం లేకుండా రహదారి మార్గాలను అందుబాటులో ఉంచాలని కమిషనర్ ఆదేశించారు. పోలీస్ బందోబస్తు అవసరమున్న ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు, సంబంధిత శాఖల సమన్వయంతో ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఆరు ప్రధాన రహదారి ప్రాంతాల్లో 127 పెండింగ్ ఆక్రమణలు ఉన్నట్లు సమావేశంలో సమీక్షించారు.

**-ఆరు ప్రధాన మౌలిక వసతుల ప్రాజెక్టులపై సమీక్ష**

కార్పొరేషన్ పరిధిలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు చేపడుతున్న ఆరు ప్రధాన మౌలిక వసతుల ప్రాజెక్టుల పురోగతిని కూడా అధికారులు సమీక్షించారు.

**-వీటిలో:**

-ఉప్పల్ జంక్షన్ వద్ద గ్రేడ్ సెపరేటర్లు
- ఏవో సి సెంటర్ చుట్టూ ప్రత్యామ్నాయ రహదారుల ఏర్పాటు
-టీ కే ఆర్ కాలేజ్ --గాయత్రీనగర్--మందమల్లమ్మ జంక్షన్ల వద్ద 6-లేన్ ద్విముఖ ఫ్లైఓవర్
-ఆర్.కె. పురం రైల్వే ఓవర్ బ్రిడ్జి (రోబో )
-రామకృష్ణాపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి (రోబో ) పునరుద్ధరణ
-మౌలాలి కోహె-మౌలాలి రోడ్/రాంప్ పనులు ఉన్నాయి.

వీటిలో నాలుగు పనులు భౌతికంగా పురోగతిలో ఉన్నాయని అధికా రులు తెలిపారు. ఆర్.కె. పురం రోబో కు ఎల్ ఓ ఏ , రామకృష్ణాపురం వద్ద పునరుద్ధరణ పనులకు ట్రాఫిక్ క్లోజర్ అవసరమున్న అంశాలను కూడా సమావేశంలో చర్చించారు.

**-తాత్కాలిక పరిష్కారాలతో పాటు శాశ్వత పరిష్కారాలు**

ట్రాఫిక్ సమస్యలకు తాత్కాలిక చర్యలతో పాటు శాశ్వత పరిష్కారాలను గుర్తించి, వివిధ శాఖల మధ్య సమన్వయంతో పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ అధికారులను ఆదేశించారు.రహదారి భద్రత, సాఫీగా ట్రాఫిక్ రాకపోకలు, ఆక్రమణల తొలగింపు, నీటి నిల్వల నివారణ, మౌలిక వసతుల అభివృద్ధి అంశాల్లో నిరంతర పర్యవేక్షణతో ఫలితాలు సాధించాలని సూచించారు.ఈ సమన్వయ సమావేశంలో ఎంఎంసీ కమిషనర్ శ్రీ టి. వినయ్ కృష్ణా రెడ్డి, ఐఏఎస్, మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ శ్రీమతి సుమతి, ఐపీఎస్, టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ శ్రీ జితేష్ వి. పాటిల్, ఐఏఎస్, మల్కాజ్‌గిరి జోనల్ కమిషనర్ శ్రీ సంచిత్ గంగ్వార్, ఐఏఎస్, ఉప్పల్ జోనల్ కమిషనర్ శ్రీమతి రాధికా గుప్తా, ఐఏఎస్, ఎల్బీ నగర్ జోనల్ కమిషనర్ శ్రీ వికాస్ మహతో, ఐఏఎస్, డీసీపీ ట్రాఫిక్ శ్రీ రాహుల్ రెడ్డి, హెచ్ ఎం డబ్ల్యు ఎస్ ఎస్ వి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీమతి పంకజతో పాటు ఎంఎంసీ డిప్యూటీ కమిషనర్లు, ఇంజినీరింగ్ అధికారులు, వివిధ విభాగాల అధిపతులు, పోలీస్, హైడ్రా , కంటోన్మెంట్, హెచ్ జి సి ఎల్ హెచ్‌ఎం డబ్ల్యూ ఎస్ ఎస్ బి , విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.ప్రజలకు సురక్షితమైన రహదారులు, మెరుగైన ట్రాఫిక్ నిర్వహణ, సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించడమే మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన లక్ష్యమని కమిషనర్ స్పష్టం చేశారు.



హంస కలం వార్త


## బిజినెస్

# ట్రంప్ టారిఫ్ దెబ్బ.. తప్పించుకునేందుకు భారత డ్రోన్లకు ఒకే ఒక మార్గం!

**అమెరికాలోకి దిగుమతయ్యే డ్రోన్లపై ట్రంప్ ప్రభుత్వం భారీ సుంకాలు**

**ప్రాధాన్య దేశాల జాబితాలో భారత్‌కు దక్కని చోటు**

**భారత డ్రోన్లపై 100 శాతం వరకు సుంకం పడే అవకాశం**

**అమెరికాలో తయారీ యూనిట్లు స్థాపిస్తే సుంకాల నుంచి మినహాయింపు**

**జాతీయ భద్రతే ఈ కఠిన నిర్ణయానికి కారణమన్న వైట్‌హౌస్**



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిగుమతి చేసుకునే డ్రోన్లపై విధించిన భారీ సుంకాల నుంచి భారత తయారీ సంస్థలు ఉపశమనం పొందేందుకు ఒక మార్గం తెరుచుకుంది. నేరుగా సుంకాల నుంచి మినహాయింపు లభించనప్పటికీ, అమెరికాలో తయారీ యూనిట్లను ఏర్పాటు చేసే కంపెనీలకు ఈ కొత్త టారిఫ్ ల నుంచి పూర్తిగా తప్పించుకునే వెసులుబాటును ట్రంప్ ప్రభుత్వం కల్పించింది. దీంతో, భారత డ్రోన్ పరిశ్రమకు సవాలు ఎదురైనప్పటికీ, అమెరికా మార్కెట్‌లోకి ప్రవేశించేందుకు ఒక ప్రత్యామ్నాయ ద్వారం తెరుచుకున్నట్లయింది. జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లుతోందనే కారణంతో విదేశీ డ్రోన్లు, వాటి విడిభాగాలపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. దీని ప్రకారం, యూరోపియన్ యూనియన్, జపాన్, దక్షిణ కొరియా వంటి మిత్రదేశాలకు తక్కువ సుంకాలు వర్తింపజేయగా, ఈ ప్రాధాన్య జాబితాలో భారత్‌కు చోటు దక్కలేదు. ఫలితంగా భారత డ్రోన్లపై 100 శాతం వరకు సుంకం పడే ప్రమాదం ఏర్పడింది. కొత్త నిబంధనల ప్రకారం, 25 కిలోల కంటే ఎక్కువ బరువున్న డ్రోన్లు, థర్మల్ ఇమేజింగ్ కెమెరాలున్న డ్రోన్లు, డాకింగ్ స్టేషన్లపై 100 శాతం సుంకం వర్తిస్తుంది. 25 కిలోల లోపు బరువున్న చిన్న డ్రోన్లపై 25 శాతం పన్ను ఉంటుంది. ఈ ప్రధాన సుంకాలు సెప్టెంబర్ 3 నుంచి అమల్లోకి రానున్నాయి. అయితే, ఈ గండం నుంచి గట్టెక్కేందుకు 'ఆన్‌షోరింగ్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని అమెరికా ప్రతిపాదించింది. దీని కింద, భారత కంపెనీలు అమెరికాలో కొత్తగా తయారీ ప్లాంట్లను నిర్మించినా లేదా పాతవాటిని ఆధునికీకరించినా... వాటికి ఈ కొత్త సుంకాల నుంచి పూర్తి మినహాయింపు లభిస్తుంది. ప్లాంట్ నిర్మాణ దశలో అవసరమైన యంత్రాలు, విడిభాగాలను కూడా సుంకాలు లేకుండా దిగుమతి చేసుకోవచ్చు. 2029 జనవరి 20లోపు నిర్మాణం ప్రారంభించాలనేది ఇందులో ప్రధాన నిబంధన. మోటార్లు, బ్యాటరీలు, ఎలక్ట్రానిక్ కంట్రోలర్ల వంటి కీలక భాగాల కోసం విదేశీ సరఫరాదారులపై అమెరికా ఎక్కువగా ఆధారపడి ఉందని, దిగుమతి చేసుకున్న డ్రోన్లలోని సాఫ్ట్‌వేర్ ద్వారా కీలక డేటా విదేశాలకు చేరే ప్రమాదం ఉందని అమెరికా వాణిజ్య శాఖ నివేదిక స్పష్టం చేయడంతో ట్రంప్ ప్రభుత్వం ఈ కఠిన చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో, అమెరికాలో పెట్టుబడులు పెట్టే భారత కంపెనీలు ఈ టారిఫ్ ల నుంచి తప్పించుకోవడమే కాకుండా, అక్కడి మార్కెట్‌లో పట్టు సాధించేందుకు కూడా అవకాశం లభించినట్లయింది.

# 600వ టెస్టు ముంగిట టీమిండియా.. చరిత్రలో నిలిచిన 5 అద్భుత విజయాలు ఇవిగో!

## క్రీడలు



**-రేపటి నుంచి భారత్-శ్రీలంక టెస్టు సిరీస్**

**-గాలే వేదికగా తొలి టెస్టు**

**-ఇది భారత్ కు 600వ టెస్టు మ్యాచ్**

భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలో మరో సువర్ణాధ్యాయం ఆవిష్కృతం కానుంది. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని టీమిండియా తన 600వ టెస్ట్ మ్యాచ్ ఆడేందుకు సిద్ధమైంది. ఈ ఘనత సాధించిన మూడో దేశంగా భారత్ చరిత్ర సృష్టించనుంది. ఇప్పటివరకు ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మాత్రమే ఈ మైలురాయిని అందుకున్నాయి. శనివారం (ఆగస్టు 15) నుంచి గాలే వేదికగా శ్రీలంకతో ప్రారంభం కానున్న తొలి టెస్టు, భారత్‌కు ఈ చారిత్రక ఘట్టానికి వేదిక కానుంది. ఇది కేవలం వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ అవకాశాల కోసమే కాకుండా, భారత క్రికెట్ ప్రస్థానంలో ఒక మైలురాయిగా నిలిచిపోనుంది. భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగస్టు 15న ఈ టెస్ట్ మ్యాచ్ ప్రారంభం కావడం మరో విశేషం. ఈ అరుదైన సందర్భంపై భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్పందిస్తూ, "600వ టెస్టుకు నాయకత్వం వహించడం ఎంతో గౌరవంగా ఉంది. అది కూడా స్వాతంత్ర్య దినోత్సవం రోజున కావడం మరింత పెద్ద గౌరవం" అని తన సంతోషాన్ని వ్యక్తం చేశాడు. ఈ చారిత్రక సందర్భంలో, భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలో అభిమానుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన ఐదు అద్భుత విజయాలను ఓసారి గుర్తుచేసుకుందాం.

### 1. పోర్ట్ ఆఫ్ స్పెయిన్, 1976 - అసాధారణ ఛేజింగ్

ఆ రోజుల్లో వెస్టిండీస్‌ను వారి సొంత గడ్డపై ఓడించడం, అందులోనూ 403 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడం ఒక కల మాత్రమే. అంతకుముందు 1948లో ఇంగ్లండ్‌పై ఆస్ట్రేలియా మాత్రమే 400 పైచిలుకు లక్ష్యాన్ని ఛేదించింది. ఈ మ్యాచ్‌లో గెలుస్తామని సునీల్ గవాస్కర్ కూడా ఊహించలేదు. తన ఆత్మకథ 'సన్నీ డేస్'లో, "ఆ వికెట్‌పై మ్యాచ్‌ను కాపాడుకోగలమని నాకు నమ్మకం ఉంది కానీ, గెలుస్తామనే ఆలోచన నా మనసులోకి అస్సలు రాలేదు" అని రాసుకున్నాడు. కానీ, టీమిండియా అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది. చివరి రోజు గెలుపునకు 269 పరుగులు అవసరమైన దశలో, 'లిటిల్ మాస్టర్' సునీల్ గవాస్కర్ అద్భుతమైన సెంచరీ (102) సాధించగా, గుండప్ప విశ్వనాథ్ (112) శతకంతో కదం తొక్కాడు. బిషన్ సింగ్ బేడీ నాయకత్వంలోని జట్టు ఆ చారిత్రక లక్ష్యాన్ని ఛేదించి సంచలనం సృష్టించింది. మరుసటి రోజు ట్రినిడాడ్ ఎక్స్‌ప్రెస్ పత్రిక "చరిత్రను ధిక్కరించిన భారత్, వెస్టిండీస్‌పై ఘన విజయం" అనే శీర్షికతో ప్రశంసించింది.

### 2. కోల్‌కతా, 2001 - ఫాలో-ఆన్ మ్యాజిక్

పోర్ట్ ఆఫ్ స్పెయిన్ విజయం చారిత్రకమైతే, 2001లో కోల్‌కతాలో ఆస్ట్రేలియాపై సాధించిన విజయం టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే ఒక అద్భుతం. ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 445 పరుగులు చేయగా, భారత్ కేవలం 171 పరుగులకే కుప్పకూలింది. 274 పరుగుల భారీ ఆధిక్యంతో ఫాలో-ఆన్‌లోకి నెట్టబడింది. ఆ దశలో భారత్‌కు అద్భుతం కంటే ఎక్కువే అవసరమైంది. అప్పుడే వీవీఎస్ లక్ష్మణ్, రాహుల్ ద్రవిడ్ మధ్య ఒక అపురూప భాగస్వామ్యం మొదలైంది. ఐదో వికెట్‌కు 376 పరుగుల రికార్డు భాగస్వామ్యం నెలకొల్పి, భారత స్కోరును 657/7 వద్ద డిక్లేర్ చేసేలా చేశారు. దీంతో ఒక్కసారిగా ఆస్ట్రేలియా ఒత్తిడిలో పడింది. తొలి ఇన్నింగ్స్‌లో హ్యాట్రిక్ సాధించిన హర్భజన్ సింగ్, ఐదో రోజు తన స్పిన్ మాయాజాలంతో ఆసీస్ బ్యాటింగ్ లైనప్‌ను కూల్చేశాడు. ఫలితంగా భారత్ 171 పరుగుల తేడాతో నమ్మశక్యం కాని విజయాన్ని అందుకుంది. ఈ గెలుపు నేటికీ అభిమానులకు గూస్‌బంప్స్ తెప్పిస్తుంది.

### 3. అడిలైడ్, 2003 - ద్రవిడ్ వీరోచిత ప్రదర్శన

ఈడెన్ గార్డెన్స్ అద్భుతం జరిగిన రెండేళ్లకు, అడిలైడ్‌లో ఆస్ట్రేలియాపై భారత్ మరో మరపురాని విజయాన్ని నమోదు చేసింది. రికీ పాంటింగ్ డబుల్ సెంచరీతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 556 పరుగుల భారీ స్కోరు సాధించింది. మళ్లీ రాహుల్ ద్రవిడ్, వీవీఎస్ లక్ష్మణ్ ద్వయం కోల్‌కతా పోరాటాన్ని గుర్తుచేస్తూ 333 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. ద్రవిడ్ (233), లక్ష్మణ్ (148) రాణించడంతో భారత్ 523 పరుగులు చేసింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో అజిత్ అగార్కర్ తన అద్భుతమైన బౌలింగ్‌తో చెలరేగాడు. కేవలం 41 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టడంతో ఆతిథ్య జట్టు 196 పరుగులకే ఆలౌటైంది. 230 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ తరఫున ద్రవిడ్ మరోసారి నిలబడ్డాడు. ప్రశాంతంగా, అజేయంగా 72 పరుగులు చేసి చివరి రోజు భారత్‌ను 4 వికెట్ల తేడాతో గెలిపించాడు.

### 4. బ్రిస్బేన్, 2021 - చారిత్రక గబ్బా గెలుపు

గాయాలతో సతమతమవుతూ, కీలక ఆటగాళ్లు లేకుండా ఆస్ట్రేలియాలో సాధించిన గబ్బా విజయం భారత టెస్ట్ చరిత్రలో ఒక శిఖరం లాంటిది. విరాట్ కోహ్లీ, జస్ప్రీత్ బుమ్రా, రవిచంద్రన్ అశ్విన్, మహమ్మద్ షమీ, రవీంద్ర జడేజా, హనుమ విహారి, ఉమేష్ యాదవ్ వంటి కీలక ఆటగాళ్లు లేకుండా బరిలోకి దిగిన గాయపడిన జట్టు, పటిష్ఠమైన ఆస్ట్రేలియాను ఎదుర్కొంది. ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 369 పరుగులకు సమాధానంగా, శార్దూల్ ఠాకూర్, అరంగేట్ర ఆటగాడు వాషింగ్టన్ సుందర్ వీరోచిత పోరాటంతో భారత్ 336 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో మహమ్మద్ సిరాజ్ 5 వికెట్లతో చెలరేగడంతో ఆసీస్ 294 పరుగులకు ఆలౌటైంది. 32 ఏళ్లుగా గబ్బాలో ఓటమన్నదే ఎరుగని ఆస్ట్రేలియాపై భారత్ 328 పరుగుల కఠిన లక్ష్యాన్ని ఛేదించాల్సి వచ్చింది. శుభ్‌మన్ గిల్ (91), రిషభ్ పంత్ (89లి), సుందర్ (22) అద్భుతమైన ఇన్నింగ్స్‌లతో ఆసీస్ బౌలింగ్ దాడిని ఎదుర్కొని చారిత్రక విజయాన్ని అందించారు. ఈ 3 వికెట్ల గెలుపునకు భారత టెస్ట్ చరిత్రలో ఎప్పటికీ ప్రత్యేక స్థానం ఉంటుంది.

### 5. లార్డ్స్, 2021 - కోహ్లీ నాయకత్వంలో దూకుడైన విజయం

2021 లార్డ్స్ టెస్టులో ఇరు జట్ల మధ్య హోరాహోరీ పోరు నడిచింది. కేఎల్ రాహుల్ సెంచరీతో భారత్ 364 పరుగులు చేస్తే, జో రూట్ అద్భుత ఇన్నింగ్స్ (180)తో ఇంగ్లండ్ 391 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో మహమ్మద్ షమీ, జస్ప్రీత్ బుమ్రా లోయర్ ఆర్డర్ పోరాటంతో భారత్ 298/8 వద్ద డిక్లేర్ చేసింది. చివరి రోజు దాదాపు రెండు సెషన్ల ఆట మిగిలి ఉండటంతో మ్యాచ్ డ్రాగా ముగుస్తుందని అంతా భావించారు. కానీ కెప్టెన్ విరాట్ కోహ్లీ తన జట్టులో స్ఫూర్తి నింపుతూ, "ఈ 60 ఓవర్లలో వాళ్లకు నరకం చూపించాలి" అని పిలుపునిచ్చాడు. ఆ మాటలు జట్టులో కొత్త ఉత్సాహాన్ని నింపాయి.

# ‘అగధ’ – మూవీ రివ్యూ!




భారీ చిత్రాల నిర్మాతగా ఎమ్మెస్ రాజుకి మంచి పేరు ఉంది. ‘దేవి’ .. ‘దేవీ పుత్రుడు’ వంటి ఫాంటసీ సినిమాలు ఆయన ఖాతాలో ఉన్నాయి. దైవశక్తి – దుష్ట శక్తి నేపథ్యంలో ఆయన రూపొందించిన తాజా చిత్రమే ‘అగధ’. దర్శకుడిగా ఆయన తెరకెక్కించిన సినిమా ఇది. కామాక్షి భాస్కర్ల ప్రధానమైన పాత్రను పోషించిన ఈ సినిమా, ఈ రోజునే థియేటర్లకు వచ్చింది. టైటిల్ తోనే అందరిలో ఆసక్తిని రేకెత్తించిన ఈ సినిమా ఆడియన్స్ ను ఎంతవరకూ ఆకట్టుకుందనేది చూద్దాం. మహాదేవి ( కామాక్షి భాస్కర్ల) తన చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోతుంది. అప్పటి నుంచి బాబాయ్ (భానుచందర్) దగ్గరే పెరుగుతుంది. బాబాయ్ కి ఇద్దరు భార్యలు .. మొదటి భార్యకి మహిమ (ఉల్కా గుప్తా) శ్రీలక్ష్మి అనే ఇద్దరు కూతుర్లు ఉంటారు. ఇక రెండవ భార్య సుశీల ( వనితా విజయ్ కుమార్)కి ‘హరిణి’ ( జోవిక విజయ్ కుమార్) అనే టీనేజ్ కూతురు ఉంటుంది. మహిమ చాలా కాలంగా ‘శివ’ను ప్రేమిస్తుంటుంది. అతని కారణంగా ఆమె గర్భవతి అవుతుంది. అయితే ఒకానొక అడవీ ప్రదేశంలో .. ‘షికావా’ అనే గుహలోకి అడుగుపెట్టిన తరువాత వాళ్ల జీవితాలు మారిపోతాయి. గర్భవతిగా ఉన్న మహిమ ఆత్మహత్య చేసుకుని చనిపోతుంది. అంతే కాకుండా ఆమె చెల్లెలు ‘హరిణి’ ప్రవర్తనలో విపరీత ధోరణి చోటుచేసుకుంటుంది. ఈ నేపథ్యంలో ఉన్నపళంగా రావలసిందిగా మహాదేవికి ఆమె బాబాయ్ కబురుపెడతాడు. ‘మహాదేవి’కి బాల్యంలోనే అమ్మవారి దర్శనమవుతుంది. అప్పటి నుంచి దుష్టశక్తులను నియంత్రించే శక్తులు ఆమెకి వస్తాయి. అందువలన దుష్టశక్తులచే పీడించబడుతున్నవాళ్లు ఆమెను ఆశ్రయిస్తుంటారు. అలాంటి మహాదేవి తన బాబాయ్ మాట మేరకు ఆ ఊరుకు చేరుకుంటుంది. అటవీ ప్రాంతంలో ఒక గుహలోకి వెళ్లి వచ్చిన తరువాతనే మహిమ ఆత్మహత్య చేసుకుందనీ, చనిపోవడానికి ముందు ఆమె ‘అగధ’ను చూసిందని మహాదేవి తెలుసుకుంటుంది.

‘అగధ’ ఎవరు? మహిమ కుటుంబ సభ్యులపై అగధ ఎందుకు పగబడుతుంది? అడవిలోని ఆ గుహలో ఆ రోజు ఏం జరుగుతుంది? అగధ బారి నుంచి మహాదేవి తన కుటుంబ సభ్యులను కాపాడుకోగలుగుతుందా? మహిమను ప్రేమించిన శివ ఏమైపోయాడు? అనేది మిగతా కథ. చిన్నతనంలోనే అమ్మవారి అనుగ్రహాన్ని పొందిన మహాదేవి, దుష్టశక్తులను తరిమేసే అతీంద్రియ శక్తులను సొంతం చేసుకుంటుంది. తనని ఆశ్రయించిన వారిని దుష్టశక్తుల బారి నుంచి రక్షిస్తూ ఉంటుంది. ఆమెను పెంచి పెద్ద చేసిన బాబాయ్ ఫ్యామిలీ, ‘అగధ’ అనే దుష్టశక్తి బారిన పడుతుంది. అప్పుడు తన ఫ్యామిలీని కాపాడుకోవడం కోసం మహాదేవి ఏం చేస్తుంది? అనేదే ఈ కథలోని ప్రధానమైన అంశం. తన లవర్ శివ .. స్నేహితుడు బబ్లూతో కలిసి ‘బస్తర్’ ఫారెస్టు ఏరియాలోని ‘షికావా’ అనే కేవ్ దగ్గరికి మహిమ బయల్దేరడంతో ఈ కథ మొదలవుతుంది. మహిమ చనిపోవడం .. ఆమె చెల్లెలు ‘హరిణి’ ఏదో దుష్టశక్తి ఆవహించినట్టుగా ప్రవర్తించడంతో ఈ కథ పుంజుకుంటుంది. ‘అగధ’ ఎవరో .. ఆ దుష్టశక్తి ఉద్దేశమేమిటో తెలుసుకుని, హరిణిని రక్షించుకోవడం కోసం మహాదేవి రంగంలోకి దిగడంతో ఈ కథ మరో మలుపు తీసుకుంటుంది. ప్రీ క్లైమాక్స్ కి దగ్గర పడుతుండగా, కథ మరింత పుంజుకుని క్లైమాక్స్ దిశగా కదులుతుంది. సాధారణంగా హారర్ థ్రిల్లర్ .. ఫాంటసీ టచ్ ఉన్న థ్రిల్లర్ సినిమాలలో కామెడీ అనేది కాస్తయినా కనిపిస్తుంది. కానీ ఎమ్మెస్ రాజు ఈ కథను మొదటి నుంచి చివరివరకూ సీరియస్ గా నడిపించారు. కథ ఎక్కడా కూడా గాడి తప్పకుండా సాగుతుంది. అలాగే కథకి తగిన సన్నివేశాలు .. ఆ సన్నివేశాలకు అవసరమైన గ్రాఫిక్స్ ను డిజైన్ చేసుకున్న తీరు ఆసక్తికరంగా అనిపిస్తుంది. అడవి నేపథ్యం .. అమ్మవారి రూపం .. గుహకి సంబంధించిన గ్రాఫిక్స్ ఆకట్టుకుంటాయి. ఎన్నో వేల ప్రేతాత్మల శక్తులను తనలో నింపుకున్న దుష్టశక్తియే ‘అగధ’. దైవశక్తిని ఎదిరించి నిలవడం.. గెలవడం దాని ప్రధానమైన ఉద్దేశం. అయితే ఈ లైన్ కి తగినట్టుగా తెరపై దుష్టశక్తి – దైవశక్తి పోరాడే సన్నివేశాలు ఉంటాయనుకుంటే పొరబాటే. దైవశక్తిని బాలా రూపంలోనూ .. దుష్టశక్తిని అద్దం పెంకులోను చూపించడంతో దర్శకుడు సరిపుచ్చారు. దుష్టశక్తిని హాలీవుడ్ సినిమాలలోని చిత్రమైన జీవిలా చూపించి ఆశ్చర్యపరిచారు. అడవి .. అక్కడి గిరిజనులు .. క్షుద్ర పూజలు .. నరబలులు .. 140 ఏళ్లకి ఒకసారి వచ్చే చంద్రగ్రహణం .. ఆ రోజునే శక్తులన్నీ పొందాలనుకున్న ఒక దుష్టశక్తి .. వంటి అంశాలు కథపై కాస్త ఉత్కంఠను పెంచుతాయి. అయితే ఈ అంశాలన్నీ గతంలోని సినిమాలలో కనిపిస్తూ .. వినిపిస్తూ వచ్చినవే. అవే సన్నివేశాలు నిదానంగా సాగుతూ ఉంటాయంతే. కాకపోతే విజువల్స్ .. చిత్రీకరణ పరంగా మెప్పిస్తూ వెళతాయి. అయితే ఈ కథ మొత్తంలో అయోమయంలో పడేసే అంశం ఒకటి ఉంది. శివ .. సింహా .. సలీమ్ పాత్రలను ఒక్కరితో ఎందుకు వేయించారో అర్థం కాదు. క్లైమాక్స్ లో కార్లో వెళుతూ అందుకు గల కారణం ఏమిటో చెబుతారు కానీ, అది మనకి అర్థమైనట్టుగా .. కానట్టుగా ఉంటుంది. కామాక్షి భాస్కర్ల నటన బాగుంది. ఆమె ఎంపిక చాలా కరెక్టుగా అనిపిస్తుంది. కాకపోతే మహాదేవిగా ఆమె నుదుటున బొట్టు విషయంలో కూడా కొంచెం కేర్ తీసుకుని ఉండవలసిందని అనిపిస్తుంది. భానుచందర్ – వనితా విజయ్ కుమార్ పాత్రలలో కొంచెం వెయిట్ వేయాలసింది. వనిత కూతురు జోవిక బాగానే చేసింది. విలన్ పాత్ర విలక్షణంగా ఏమీ అనిపించదు. రాకేశ్ వెంకటాపురం నేపథ్య సంగీతం .. నాని చమిడిశెట్టి ఆవిష్కరించిన విజువల్స్ ఆకట్టుకుంటాయి. జునైద్ సిద్ధిఖీ ఎడిటింగ్ ఫరవాలేదు. నిర్మాణ విలువలు .. గ్రాఫిక్స్ చెప్పుకోదగినవిగానే అనిపిస్తాయి. పాత అంశాలతో కూడిన కథనే .. నిదానంగా సాగే కథనమే, విజువల్స్ పరంగా మాత్రం తన మార్కు చూపిస్తూ సాగే సినిమాగా చెప్పుకోవచ్చు అంతే.

# ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ మూవీ రివ్యూ



కుటుంబ కథలతో ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ సినిమాలకు ఉన్న క్రేజ్, దాని బాక్సాఫీస్ లెక్కలు కూడా వేరుగా ఉంటాయి. కుటుంబ భావోద్వేగాలు, ఎంటర్‌టైన్‌మెంట్ జతకలిస్తే థియేటర్‌లు ఫ్యామిలీ ప్రేక్షకులతో కళకళలాడుతాయి. అందుకే కాబోలు గత కొంతకాలంగా ఫ్యామిలీ సినిమాలకు దూరంగా ఉన్న దర్శకులు, హీరోలు ఇప్పుడు అలాంటి సినిమాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ కోవలోనే హీరో సూర్య ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు. ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రధానంగా తెరకెక్కిన ఈ చిత్రంం ఎలా ఉంది? దర్శకుడు వెంకీ అట్లూరి హీరో సూర్యకు సక్సెస్‌ఫుల్ సినిమానిచ్చాడా? ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ సినిమాలో ప్రేక్షకులు అలరించే అంశాలున్నాయా? లేదా? రివ్యూలో తెలుసుకుందాం. సంజయ్ విశ్వనాథ్ (సూర్య) ఓ సంపన్న వ్యాపార కుటుంబానికి చెందిన వారసుడు. ఒకవైపు బిజినెస్ చూసుకుంటూనే మరొక వైపు అమ్మ (రాధికా శరత్ కుమార్) కోరిక మేరకు రైఫిల్ షూటింగ్‌లో నైపుణ్యం సంపాందించి భారత్ తరపున ఒలింపిక్స్‌లో పాల్గొని బంగారు పతాకం గెలుస్తాడు. అయితే వివాహం విషయంలో ఆయన మనసులో ఉన్న ఓ అభిప్రాయం కారణంగా 40 ఏండ్లు దాటినా పెళ్లి చేసుకోడు. ఆయన చిన్నప్పుడు తన ఫ్యామిలీలో జరిగిన కొన్ని సంఘటనలే అందుకు కారణం. తల్లి మాత్రం పెళ్లి చేసుకుని కుటుంబానికి వారసుడిని ఇవ్వాలని సంజయ్‌ని పదే పదే కోరుతుంది. దీంతో ఓ డాక్టర్ సలహాతో అమెరికా వెళ్లి సరోగసి ద్వారా ఓ బాలుడిని కని ఇంటికి తీసుకొస్తాడు. అయితే అనుకోకుండా ఆ బాబు అనారోగ్యానికి గురవుతాడు. బాబు అనారోగ్యం నయం కావాలంటే కన్నతల్లి అవసరం పడుతుంది. దీంతో బాబు కన్నతల్లి గురించి అమెరికా వెళతాడు సంజయ్ విశ్వనాథ్. ఇక బాబుకు జన్మనిచ్చిన తల్లి దొరికిందా? అమెరికా నుంచి ఇండియాకు రావటానికి ఆమె ఒప్పుకుందా? ఒప్పుకుంటే ఎలా కండిషన్స్ పెట్టింది? సంజయ్ తల్లి కోరిక మేరకు పెళ్లి చేసుకున్నాడా? సంజయ్ జీవితంలో మ్యాడీ (మమిత బైజు) ఎలా వచ్చింది? ఆమె వచ్చిన తరువాత ఆయన జీవితంలో వచ్చిన మార్పులేమిటి? తదితర విషయాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే. కుటుంబ భావోద్వేగాలతో కూడిన కథకు డీసెంట్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను జోడించి కుటుంబ మొత్తం హాయిగా కూర్చొని ఆస్వాదించే విధంగా ఉన్న ఎమోషనల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. సినిమా ప్రారంభమైన తొలి సన్నివేశం నుంచే ఎంతో ఆహ్లాదంగా అనిపిస్తూ చివరి సన్నివేశం వరకు మనసుకు హత్తుకునే విధంగా ఈ సినిమాను మలిచారు దర్శకుడు వెంకీ అట్లూరి. హీరో సూర్యను ఇలాంటి స్టయిలిష్ రోల్‌లో చూసి చాలా రోజులైంది. ఆయన స్టైల్‌కు తగిన విధంగా ఓ బ్యాక్‌డ్రాప్‌ను ఎంచుకుని దానికి ఫ్యామిలీ ఎమోషన్స్‌ను మేళవించిన విధానం ఎంతో ప్రశంసనీయం. హీరో, హీరోయిన్ల మధ్య ఉన్న ఏజ్ గ్యాప్, సరోగసి ద్వారా బిడ్డను కనడం, దానితో ముడిపడిన ఎమోషన్స్, హీరోయిన్ క్యారెక్టర్‌ను డిజైన్ చేసిన విధానం ఎంతో బాగుంది. ఈ సినిమా చూస్తున్నంత సేపు ఓ మంచి సినిమా చూస్తున్నం అనే ఆనందం సినిమా చూసే ప్రేక్షకుడికి మనసుకి కలుగుతుంది. సినిమా ప్రారంభం నుంచి కూడా ఎక్కడా కూడా సినిమాను డ్రాప్ అవ్వకుండా దర్శకుడు వెంకీ అట్లూరి డీల్ చేసిన విధానం ప్రశంసనీయం. ‘కోపం, ద్వేషం కూడా కొంతకాలం తరువాత అలిసిపోతాయి’ వంటి సంభాషణలు ఆలోచింపజేస్తాయి. చాలా చోట్ల దర్శకుడు వెంకీ అట్లూరిలో త్రివిక్రమ్ గారి శైలి కనిపించింది. ముఖ్యంగా డ్రైవర్ ముత్తుస్వామి, ఆయన కొడుకుతో ఓ టీవీ ఛానెల్ ఇంటర్వ్యూలో సూర్య మాట్లాడిన విధానం, అంజలీ దేవి (రవీనా టాండన్) ఆమె కూతురు తల్లిదండ్రులతో ముడిపడిన సన్నివేశాలు ,అందరిని కంటతడి పెట్టిస్తుంది. ఇలాంటి ఎమోషన్ సన్నివేశాలు ఈ సినిమాలో అందరి హృదయాలకు హత్తుకోవడమే కాదు ఆలోచింపజేస్తాయి. ఈ సినిమాలో సూర్య మాస్ ఫ్యాన్స్ కోసం పెట్టిన యాక్షన్ ఏసిపోడ్స్ కూడా ఎంతో క్లాస్‌గానే ఉంటాయి. సినిమా ముగింపు కూడా ఎంతో క్లాస్‌గానే ఉంటుంది. సంజయ్‌గా హీరో సూర్య ఎంతో స్టయిలిష్‌గా కొత్త లుక్‌లో కనిపించాడు. సంజయ్ విశ్వనాథ్ పాత్రకు ఆయన వల్ల ఎంతో హుందాతనం వచ్చింది అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ఆయన వయసును కనిపించకుండా దాచాలనే తాపత్రయం కూడా ఎక్కడా కనిపించదు. ఆయన నటన కొన్ని ఎమోషన్స్ సీన్స్‌ల్లో అందరిచేత భావోద్వేగానికి గురిచేసింది. ఇక ఈ సినిమాకు మరో హీరో మమిత బైజు ఆమె ఎనర్జీ, నటన ఈ సినిమాకు మరో బిగ్గెస్ట్ ప్లస్ పాయింట్. ఆ పాత్రను దర్శకుడు చాలా చక్కగా డిజైన్ చేశాడు. ఆమె నటన కూడా ఎంతో నేచురల్‌గా అనిపించింది. కథానాయకుడి తల్లిగా రాధికా శరత్‌కుమార్ నటన ఆకట్టుకుంది.సునీల్ రెడ్డి, రవీనా టాండన్, నాజర్ తదితరులు తమ పాత్రల్లో ఒదిగిపోయారు. జీవీ ప్రకాష్ కుమార్ నేపథ్య సంగీతం ఈ చిత్రానికి ఎమోషనల్ కంటెంట్ అనే ఫీల్‌ను కలిగిస్తుంది. ఫోటోగ్రఫీ ప్రతిభతో విజువల్స్ ఎంతో ప్లెజెంట్‌గా ఉన్నాయి. నిర్మాణ విలువలు బాగున్నాయి. ఈ మధ్య కాలంలో వచ్చిన వచ్చిన హార్ట్ టచ్చింగ్ క్లీన్ ఫ్యామలీ ఎంటర్ టైనర్ ఇది. ఒకవైపు ఎంటర్‌టైన్ చేస్తూనే మరో వైపు అందరి హృదయాలకు హత్తుకునే కథ, కథనాలతో సినిమా ఆద్యంతం అలరిస్తుంది. తప్పకుండా అందరూ ఫ్యామిలీతో చూడాల్సిన సినిమా.!

**Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037, Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449**